గురువారం
13-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 22
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

చిలీలో వింత వైరస్

దక్షిణ అమెరికాలోని చిలీ దేశాన్ని కొత్త వైరస్ కలవర పెడుతోంది. ఈ వైరస్ సోకిన వారికి నరాలు పనిచేయకుండా.. మొత్తం కండరాల వ్యవస్థ నిర్వీర్యం అవుతుంది. ఇది పక్షవాతానికి కూడా దారితీస్తుందని వైద్య నిపుణులు గుర్తించారు. దీనికి చికిత్స లేకపోవడంతో ఏం చేయాలో పాలు పోని స్థితిలో చిలీ ప్రభుత్వం ఉంది.

2 లో

అసైన్డ్, లంక భూములకు పట్టాలు

- 24న ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన
- ఎస్సీ కాలనీల్లో శ్మశాన వాటికలకు భూముల కేటాయింపు
- అర్చకుల పదవీ విరమణ వయస్సు పరిమితి ఎత్తివేత
- రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
రాష్ట్రంలో అసైన్డ్, లంక భూముల విషయంలో పూర్తి హక్కులు లబ్ధిదారులకే కేటాయించాలని మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. అలాగే అమరావతి రాజధాని కేసు విచారణను సుప్రీం కోర్టు డిసెంబరుకు వాయిదా వేసినప్పటికీ, ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణంపై ముందుకే వెళ్లాలని నిర్ణయించింది. ఈనెల 24న ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని ముహూర్తం నిర్ణయించింది. ఇందుకోసం ఇళ్ల నిర్మాణం జరుపుకుంటున్న లే అవుట్లలో మౌలిక సదుపాయాల కోసం రూ.384.52 కోట్లు కేటాయిస్తూ కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన బుధవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం మూడున్నర గంటల పాటు సాగింది. సుమారు 55 అంశాలపై మంత్రివర్గం చర్చించి నిర్ణయాలు తీసుకుంది. ఈ వివరాలను సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మీడియాకు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా భూమిలేని నిరుపేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు 63,191.84 ఎకరాలు, లంక భూముల విషయంలో 66,111 మందికి పూర్తి హక్కులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. అయితే ఇది ఒరిజినల్ అసైనీలకు మాత్రమే వర్తించనుందని, ఒరిజినల్ అసైనీలు కాలం చేస్తే వారి వారసులకు ఈ నిబంధన వర్తిస్తుందని చెప్పారు.

అలాగే రాష్ట్ర విభజనకు ముందు ల్యాండ్ పర్చేజ్ స్కీం కింద గతంలో 16,213 ఎకరాలు పొందిన దళితులకు సానుకూలంగా మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. 14,223 మందికి గతంలో భూములు, వారు కట్టాల్సిన రుణాలు, రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా మాఫీ చేసింది. దీనివల్ల దాదాపు రూ.2 వేల కోట్ల విలువైన భూములపై వారికి పూర్తి హక్కులు రానున్నాయి. ఆగస్టు మొదటి వారంలో దళితులకు హక్కు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయించింది. గ్రామాల్లోని కుల వృత్తులు చేసుకునేవారికి ఇచ్చిన ఇనాం భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ఆమోద ముద్ర వేసింది.

మరికొన్ని కేబినెట్ నిర్ణయాలు ఇవే

- ఈ నెల 18న జగనన్న తోడు, 21 నేతన్న నేస్తం, 26న సున్నా వడ్డీ, 28న విదేశీ విద్యాదీవెన కింద లబ్ధిదారులకు నిధులు జమ
- 1966 రెవెన్యూ గ్రామాల్లో స్మశాన వాటికలు లేని ఎస్సీలకు స్మశాన వాటికలకు భూములు కేటాయింపు... జిల్లా కలెక్టర్లకు భూ కేటాయింపు అధికారాలు
- నంద్యాల జిల్లా బేతంచర్ల, అనంతపురం జిల్లా గుంతకల్, వైఎస్సార్ జిల్లా మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాలల్లో పోస్టుల భర్తీ
- ప్రతి జిల్లాకు ఒకటి చొప్పున 26, ప్రతినియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 నైపుణ్యాభివృద్ధి సంస్థల ఏర్పాటు, వీటన్నింటికి ఒక యూనివర్సిటీ
- జేఎన్‌టీయూ కాకినాడలో 27 నాన్‌టీచింగ్ స్టాఫ్ నియామకానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్
- విశ్వవిద్యాలయాల్లో బోధనా సిబ్బంది కొరతను తీర్చేందుకు రిటైరైన వారిని కాంట్రాక్టు పద్ధతిలో వినియోగించుకోవాలని నిర్ణయం
- టోఫెల్ పరీక్షల కోసం ప్రభుత్వ విద్యార్థులకు శిక్షణ, విఖ్యాత విద్యా సంస్థ ఈటీఎస్‌తో ఒప్పందానికి నిర్ణయం
- కర్నూలులో కేన్సర్ ఇనిస్టిట్యూట్‌కు 247 పోస్టులు మంజూరు, పుంగనూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్
- ఆంధ్ర ప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌ను ప్రభుత్వ విభాగంలో కలిపేందుకు ఆమోదం. విశాఖపట్నంలో విమ్స్‌ను వైద్య కళాశాలగా మార్పు
- వైఎస్సార్ జిల్లా గండికోట ముంపు బాధితులకు రూ.454.6 కోట్లు ఇచ్చేందుకు ఆమోదం
- పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు సహాయ పునరావాస పనుల కోసం ప్రత్యేక ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు
- వైఎస్సార్ జిల్లా వేంపల్లిలో 1500 మెగావాట్ల పంప్డ స్టోరేజీ ప్రాజెక్టు
- ఏపీఐఐసీ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పరిశ్రమలకు 352.79 ఎకరాల కేటాయింపు
- ఏపీ మారిటైం బోర్డు రూ.3884.70 కోట్ల రుణం తీసుకునేందుకు అవసరమైన గ్యారెంటీని ఇవ్వాలని నిర్ణయం
- చెన్నై-కడప, విజయవాడ-కడప, బెంగళూరు-కడప, విశాఖపట్నం-కడప మధ్య విమానాలు నడిపే ఇండిగోకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్
- అర్చకులకు రిటైర్మెంట్ లేదు. ఈ మేరకు చట్ట సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దేవాదాయ శాఖ ఉద్యోగులకు కూడా రిటైర్‌మెంట్ వయసు 62 ఏళ్లకు పెంపు
- కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో 13 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టుల మంజూరు
- విశాఖ భూముల అక్రమాలకు సంబంధించిన సిట్ ముగ్గురు సభ్యుల కమిటీ తొలి నివేదికకు, మొత్తంగా 69 సిఫార్సులకు కేబినెట్ ఆమోదం తెలిపారు.

సర్పంచ్‌ల నిధుల మళ్లింపుపై
నివేదిక ఇవ్వండి
ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
గ్రామ సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా పంచాయతీ నిధులను ఇతర ఖాతాలకు మళ్లించారన్న ఆరోపణలపై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బుధవారం హైకోర్టు ఆదేశించింది. సర్పంచ్‌ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర శాఖలకు మళ్లించిందంటూ హైకోర్టులో ఏపీ సర్పంచ్‌ల సంఘం గౌరవ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా నిధులను ప్రభుత్వం నేరుగా తమ ఖాతాలోకి మళ్లించుకుందని పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది వీరారెడ్డి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై కోర్టు స్పందిస్తూ రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

హైకోర్టును ఆశ్రయించిన ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల యాజమాన్యాలు

ఫీజు నియంత్రణ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను పాటించడం లేదంటూ ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. ఒకపక్క నిర్వహణ ఖర్చులు పెరుగుతుండగా, ప్రభుత్వం ఏటా ఫీజులు తగ్గిస్తోందని కళాశాలల తరపున న్యాయవాది శ్రీవిజయ్ వాదనలు వినిపించారు. రెగ్యులేటరీ కమిషన్ తరపున సుదేశ్ ఆనంద్ వాదనలు వినిపించారు. దీనిపై స్పందించిన హైకోర్టు ధర్మాసనం కమిషన్... విద్యాసంస్థలకు ముందస్తు అవకాశం ఇచ్చిందో, లేదో చెప్పాలని, అప్పటివరకు ఫీజులపై నోటిఫికేషన్ ఇవ్వకూడదని స్పష్టం చేసింది. తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

ఏపీకి రూ.493 కోట్లు
తెలంగాణకు రూ.188 కోట్లు-మరో 20 రాష్ట్రాలకూ
విపత్తు నిర్వహణ నిధులు విడుదల చేసిన కేంద్రం

న్యూఢిల్లీ:
విపత్తు నిర్వహణకు సంబంధించి రాష్ట్రాలకు నిధులను కేంద్రప్రభుత్వం విడుదల చేసింది. మొత్తంగా 22 రాష్ట్రాల కోసం రూ.7,532 కోట్లు విడుదల చేయగా ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.493.60కోట్లు, తెలంగాణకు రూ.188.80కోట్లను కేంద్రం కేటాయించింది. అలాగే, మహారాష్ట్రకు రూ.1,420.80కోట్లు, ఉత్తరప్రదేశ్‌కు రూ.812 కోట్లు, బీహార్‌కు రూ.624.40కోట్లు, గుజరాత్‌కు రూ.584 కోట్లు, ఒడిశాకు 707.60కోట్లు, తమిళనాడుకు రూ.450 కోట్లు, కేరళ రూ.138 కోట్లు, పంజాబ్ రూ.218.40 కోట్లు, ఉత్తరాఖండ్‌కు రూ.413.20 కోట్లు, అసోంకు రూ.340.40కోట్లు, అరుణాచల్ ప్రదేశ్‌కు రూ.110.40కోట్లు, చత్తీస్‌గఢ్‌కు రూ.181.60కోట్లు, హరియాణాకు రూ.216.80కోట్లు, హిమాచల్‌ప్రదేశ్‌కు రూ.180.40కోట్లు, కర్నాటకకు రూ.348.80కోట్లు చొప్పున కేటాయించింది. గోవాకు రూ.4.80 కోట్లు,

- మిగతా 2 లో

చంద్రయాన్-3కి
రంగం సిద్ధం
రేపు నింగిలోకి బాహుబలి రాకెట్
మధ్యాహ్నం 2:35 గంటలకు...

విశాలాంధ్ర-సూళ్లూరుపేట:
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రతిష్ఠాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ప్రయోగం చేపట్టనుంది. రికార్డుస్థాయి ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెడుతూ ప్రపంచ దేశాలను సైతం ఆకట్టుకుంటున్న ఇస్రో...చంద్రుడిపై మరిన్ని పరిశోధనలు చేపట్టేందుకు ముందుకు వచ్చింది. అత్యాధునిక టెక్నాలజీతో ఎల్‌వీఎం-3 రాకెట్ ద్వారా చంద్రయాన్-3 ప్రయోగానికి ఏర్పాట్లు పూర్తిచేసింది. చంద్రయాన్-3 మిషన్ ప్రయోగాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ రెండవ ప్రయోగ వేదిక నుండి జులై 14న తేదీ మధ్యాహ్నం 2.35 గంటలకు ప్రయోగించేందుకు

- మిగతా 2 లో

మరో 'వ్యాపమ్' స్కామ్?
ఒకేచోట పరీక్ష రాసిన ఏడుగురు టాపర్లు
రాజకీయ దుమారం

భోపాల్:
పదేళ్ల క్రితం మధ్యప్రదేశ్‌ను వ్యాపమ్ కుంభకోణం కుదిపేసింది. ఉద్యోగ నియామకాల్లో బయటపడిన మోసాలు రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపాయి. తాజాగా మరోసారి రాష్ట్రంలో ఈ తరహా కుంభకోణం జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఓ నియామక పరీక్షలో టాపరుగా నిలిచిన వారిలో చాలామంది ఒకే కేంద్రంలో పరీక్ష రాయడం అనుమానాలకు తావిస్తోంది. పైగా అది స్థానిక బీజేపీ ఎమ్మెల్యేకు చెందిన కళాశాల కావడంతో మరింత వివాదాస్పదమైంది. మధ్యప్రదేశ్‌లో ఇటీవల గ్రూప్ 2, గ్రూప్ 4 పట్వారీ పరీక్ష జరగ్గా... వాటి ఫలితాలను జూన్ 30న విడుదల చేశారు. ఆ తర్వాత మూడు రోజులకు ఈ పరీక్షలో టాపర్లుగా నిలిచిన 10 మంది జాబితాను ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9.78 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. అయితే, ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన 10

- మిగతా 2 లో

పీఆర్సీ కమిషన్ ఛైర్మన్‌గా
మన్మోహన్‌సింగ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీజేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మన్మోహన్‌సింగ్ చైర్మన్‌గా పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ నివేదికను కమిషన్ రూపొందించనుంది. గత కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ఏడాదిలోగా పీఆర్సీతోపాటు వివిధ అంశాలపై కమిషన్ అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. వివిధ ప్రభుత్వ కేటగిరీలకు చెందిన ఉద్యోగుల వివరాలు, వారికి సంబంధించిన అంశాలతోపాటు స్థానికంగా ఉన్న పరిస్థితులు, కరువు భత్యంపై అధ్యయనం చేసిన తర్వాత సిఫార్సు చేయాలని పీఆర్సీకి ప్రభుత్వం సూచించింది.

ఇదీ లోకం!

మన వాళ్ళకు కౌన్సిలింగ్ అవసరమేమో అనిపిస్తోంది సార్!

ఏపీని అప్పుల ప్రదేశ్‌గా మార్చిన జగన్
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి అడుగంటిపోతూ అప్పులు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ప్రదేశ్‌గా మార్చారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక అందినకాడికి అప్పులు చేస్తూ ఏపీని అప్పుల మయం చేసింది. ఏపీ అప్పు ఇప్పటికే దాదాపు రూ.10 లక్షల కోట్లకు చేరిందని ఆర్థిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసిన అప్పుల్లో ఏమాత్రం కూడా రాష్ట్ర అభివృద్ధి కోసం వినియోగించలేదు. ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితికి మించి అప్పులు చేయటం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి పరిపాటిగా మారింది. కేవలం 90 రోజుల్లోనే రూ.27 వేల కోట్ల అప్పులు తెచ్చి రికార్డు సృష్టించింది. విద్యుత్ సంస్కరణలను వేగవంతంగా అమలు చేస్తున్నందుకు కేంద్ర ప్రభుత్వం మరో రూ.9 వేల కోట్లు రుణాన్ని మంజూరు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇక కేవలం మరో రూ.3 వేల కోట్లు మాత్రమే రుణ పరిమితి మిగిలి ఉండటం గమనార్హం. ప్రభుత్వ ఉద్యోగులకు నెలనెలా జీతాలు చెల్లించాలంటే అప్పులు తీసుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆఖరికి నవరత్న పథకాలకు కూడా అప్పులు చేయనిదే అమలు చేయలేని పరిస్థితి

- మిగతా 2 లో

జగన్ మూర్ఖత్వానికి రాష్ట్రం బలి

- పోలవరం, అమరావతి ప్రాజెక్టులను నాశనం చేశారు
- దెబ్బతిన్న రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడతా
- సంపద సృష్టించి పేదలను ధనవంతులుగా మారుస్తా
- మీడియాతో చంద్రబాబు చిట్‌చాట్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
రాష్ట్ర విభజన వల్ల కన్నా వైసీపీ ప్రభుత్వ పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగిందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మూర్ఖపు నిర్ణయాలకు రాష్ట్రం బలైందని చంద్రబాబు ఆవేదన చెందారు. ఏపీకి జీవనాడిలాంటి పోలవరం ప్రాజెక్టును జగన్ తన అసమర్థతో పూర్తి చేయలేకపోయారని, మరోవైపు రాష్ట్రానికి సంపద సృష్టించే అమరావతి రాజధానిని కక్షపూరితంగా సర్వనాశనం చేశారని మండిపడ్డారు. దీనివల్ల అంతిమంగా రాష్ట్రం, ప్రజలే నష్టపోయారన్నారు.

ఉండవల్లిలోని తన నివాసంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో చంద్రబాబు బుధవారం చిట్‌చాట్ చేశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, పాలనా వ్యవహారాలు, ప్రజల సమస్యలు, టీడీపీ నిర్వహించబోయే కార్యక్రమాలపై చంద్రబాబు తన ఆలోచనలు పంచుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను విధ్వంసం చేసిందని, అందువల్ల టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తమకు అనేక సవాళ్లు ఉంటాయన్నారు. అయితే తనకు ఉన్న బ్రాండ్‌తో, విధానాలతో వేగంగా సంపద సృష్టిస్తామని, తద్వారా పేదల జీవన ప్రమాణస్థాయి పెంచేలా, వారిని ధనవంతులుగా మార్చే మెరుగైన సంక్షేమ పథకాలు అందించి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా అమలు చేసే

- మిగతా 2 లో

చిలీలో వింత వైరస్

నరాలు, కండరాల వ్యవస్థపై దాడి

3 నెలలు హెల్త్ ఎమర్జెన్సీ

చిలీ: దక్షిణ అమెరికాలోని చిలీ దేశాన్ని కొత్త వైరస్ కలవర పెడుతోంది. ఈ వైరస్ సోకిన వారికి నరాలు పనిచేయకుండా.. మొత్తం కండరాల వ్యవస్థ నిర్వీర్యం అవుతుంది. ఇది పక్షవాతానికి కూడా దారితీస్తుందని వైద్య నిపుణులు గుర్తించారు. దీనికి చికిత్స లేకపోవడంతో ఏం చేయాలో పాలు పోని స్థితిలో చిలీ ప్రభుత్వం ఉంది. దీంతో మూడు నెలల హెల్త్ ఎమర్జెన్సీని గిలాన్ బరే సిండ్రోమ్- జీబీఎస్ అనే అరుదైన వ్యాధితో శరీరంలో రోగ నిరోధక శక్తి తగ్గిపోవడంతో నరాల వ్యవస్థ పూర్తిగా నాశనమై కండరాల వ్యవస్థ నిర్వీర్యవుతుంది. ఈ వైరస్ మొదట కాళ్లలో ప్రారంభమై.. క్రమంగా పైకి వ్యాపిస్తూ.. శరీరం మొత్తం చేరుతుందని వైద్యనిపుణులు గుర్తించారు. ఇది పక్షవాతానికి దారి తీస్తుందని జిన్హువా వార్తా సంస్థ వెల్లడించింది. వృద్ధులు ముఖ్యంగా పురుషులపై అధిక ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని వయస్సుల వారికీ దీంతో ప్రమాదం ఉందని ప్రభుత్వం హెచ్చరించింది. ఎక్కువగా ఇన్ఫెక్షన్లు సోకడం ముఖ్యంగా కాంపిలోబాక్టర్ జెజునీ అనే బ్యాక్టీరియా ఈ వైరస్ రావడానికి కారణమని ప్రాథమికంగా తేల్చారు. ఇన్ఫ్లుయెంజా, సైటోమెగలూ, ఎప్‌స్టెయిన్‌బర్‌తో పాటు కొవిడ్ కారణంగా గిలాన్ బరే సిండ్రోమ్ బారిన పడే అవకాశాలు ఎక్కువని నిపుణులు చెబుతున్నారు.ఈ రోగాన్ని నరాల పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. ముఖ్యంగా స్పైనల్ టాప్, ఎలక్ట్రోమియోగ్రఫీ వంటి టెస్టులు కచ్చితంగా వ్యాధిని గుర్తించగలవు. ఈ సిండ్రోమ్ సోకితే విపరీతమైన నీరసం ఉంటుంది, ఇదే ప్రధాన లక్షణమని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ డిజార్డర్స్ అండ్ స్ట్రోక్ తెలిపింది. రెండవ లక్షణంగా శ్వాస తీసుకోవడంతో ఇబ్బంది మొదలవుతుందని వెల్లడించింది. ఆ తర్వాత రెండు వారాల్లో రోగం ముదిరి రోగి కదలలేని దశకు చేరుతారని, కంటి చూపు మందగించడం, కంటి నరాలు దెబ్బతినడం, మాట్లాడటం, నమలడం, తినడం కష్టం అవుతుందని వివరించింది. చేతులు, కాళ్లలో సూదులతో గుచ్చుతున్నట్లు అనిపిస్తుందని, విపరీతమైన ఒళ్లు నొప్పులు, బీపీ పెరగడం, జీర్ణాశయ సంబంధ సమస్యలు వస్తాయని చెప్పింది. ఈ వైరస్ బారిన పడిన వారికి ఇంట్రావీనస్ ఇమ్యునోగ్లోబులిన్ - ఐవీఐజీ చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. నరాలపై వైరస్ దాడి చేయకుండా రోగ నిరోధక శక్తిని పెంచే చికిత్స ఇస్తున్నట్లు వెల్లడించారు.

నేపాల్ ప్రధానికి సతీవియోగం

ఖాట్మండు: నేపాల్ ప్రధాని కమల్ దహల్ ప్రచండ సతీమణి సీతా దహల్ (69) కన్నుమూశారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న ఆమె ఖాట్మండులోని నోర్వీ ఇంటర్నెషనల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 8.33 గంటలప్పుడు తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు వివరాలను పత్రికా సమన్వయకర్త సూర్య కిరణ్ శర్మ వెల్లడించారు. సీతా దహల్ ప్రోగ్రెసివ్ సూప్రాన్యూక్లియర్ పాల్సీ (పీఎస్‌పీ), పార్కిన్‌సన్, మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలతో ఇబ్బంది పడినట్లు ఆసుపత్రి బులెటిన్ పేర్కొంది. ఆరోగ్యం విషమించడంతో ఆమెను బుధవారం ఆసుపత్రికి తరలించి, అత్యవసర చికిత్స అందించినప్పటికి ఆమె ప్రాణాలను కాపాడలేకపోయినట్లు ప్రొఫెసర్ డాక్టర్ యువరాజ్ శర్మ వెల్లడించారు. ప్రచండ, సీత దంపతులకు నలుగురు సంతానం. వారిలో పెద్ద కుమార్తె గ్యాను దహల్, ఏకైక కుమారుడు ప్రకాశ్ దహల్ ఇంతకుముందే మరణించారు. మరో ఇద్దరు కుమార్తెల్లో ఒకరైన రేణు దహల్ ప్రస్తుతం భరత్‌పూర్ నగర మేయర్‌గా ఉన్నారు. సీతా దహల్ అంత్యక్రియలు ఖాట్మండులోని పశుపతి ఆలయం వద్ద ఆర్యఘాట్‌లో మధ్యాహ్నం 2గంటలకు ముగిశాయి. అనేకమంది ప్రముఖులు నివాళులర్పించారు.

డిజిటల్ సహకారాన్ని పెంచుకుందాం

తొలి వాణిజ్య సదస్సులో టర్కీ, చైనా సంకల్పం

ఇస్తాంబుల్: డిజిటల్ సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవాలని టర్కీ, చైనా దేశాలు సంకల్పించాయి. టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో జరిగిన తొలి వాణిజ్య సదస్సులో ఈ మేరకు ఒప్పందాలు జరిగాయి. టర్కీ- విదేశీ ఆర్థిక సంబంధాల బోర్డు (డీఈఐకే), టర్కీ పరిశ్రమలు, వాణిజ్య సమాఖ్య (టీయూఎస్ఐఏడీ) అధ్వర్యంలో డివిజన్ సంస్కరణలు, భవిష్యత్ రూపకల్పన' అంశంపై సదస్సులో రెండు దేశాల నుంచి 100 మందికిపైగా వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. ద్వైపాక్షిక డిజిటల్ సయోధ్యపై ప్యానల్లు పాల్గొనగా టర్కీ, చైనా కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు తమ విజయగాథలు, అనుభవాలను పంచుకున్నారు. టర్కీ-చైనా రెండవ వాణిజ్య సదస్సు వచ్చే ఏడాది చైనాలో జరగబోతోందని అంతర్జాతీయ వాణిజ్యాన్ని పెంపొందించే చైనా మండలి (సీసీపీఐటీ) వైస్ చైర్మన్ జాంగ్ తెలిపారు. కృత్రిమ మేధస్సు, స్మార్ట్ నగరాలు, హరిత పరిజ్ఞానం, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం తదితర అనేక రంగాల్లో తమ సంబంధాలను బలోపేతం చేసుకోవాలని చైనా, టర్కీ నిర్ణయించినట్లు వెల్లడించారు. రెండు దేశాలకు ప్రయోజనం ఉండేలా ద్వైపాక్షిక బంధాన్ని బలపర్చుకోవాలని చైనా సిద్ధంగా ఉందన్నారు.

నవంబరులో బీజింగ్‌లో జరగబోయే చైనా ఇంటర్నేషనల్ సప్లై చెయిన్ ఎక్స్‌పో (సీఐఎస్‌సీఈ)కు హాజరుకావాలని టర్కీ కంపెనీలను ఆహ్వానించారు. తొలి వాణిజ్య సదుస్సులో భాగంగా డీఈఐకే, టీయూఎస్ఏఐఏడీ, సీసీపీఐటీ మధ్య అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

నాటోపై పోరులో జాప్యమొద్దు

టర్కీ కమ్యూనిస్టు పార్టీ పిలుపు

అంకారా: ఒకదాని తర్వాత ఒకటిగా దేశాలకు సభ్యత్వమిస్తూ ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న నాటోకు అడ్డుకట్ట వేయడం ఎంతైనా అవసరమని టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) ఉద్ఘాటించింది. తాజాగా స్వీడెన్‌కు సభ్యత్వం కల్పించడం, అందుకు టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ పచ్చజెండా ఊపడాన్ని ప్రస్తావించింది. నాటో... ప్రపచంలోనే అతిపెద్ద ఉగ్రసంస్థ అని, దీనిని అడ్డుకోవడం అత్యవసరమని, ఇందుకోసం జరిపే పోరాటంలో మరింత జాప్యం తగదని పిలుపునిచ్చింది. దీనిని వదిలేస్తే మరో దేశం కూడా నాటోలో చేరేందుకు ఎంతో సమయం పట్టబోదని తాజా ప్రకటనలో టీకేపీ ఆందోళన వ్యక్తంచేసింది. 'ఇతర దేశాల ప్రజల అణచివేతలో మన ప్రభుత్వ పాత్రకు వ్యతిరేకంగా పోరాటడం కూడా మన కర్తవ్యం' అని నొక్కిచెప్పింది. 'నాటో విస్తరణతో దానికి బలం పెరుగుతోంది. ముందుగా సభ్యదేశాల వర్కర్లపై దాడులు జరుగుతాయి. ఈ సంస్థ విస్తరణకు అర్థం ప్రపంచానికి యుద్ధం ముప్పును పెంచడమే' అని టర్కీ కమ్యూనిస్టు పార్టీ ప్రకటన పేర్కొంది.

టర్కీ చరిత్రలోనే విప్లవ వ్యతిరేక పార్లమెంటు ఇదేనని ఎర్డోగన్ పాలనను ఉద్దేశించి వ్యాఖ్యానించింది. 'నాటో విస్తరణను అడ్డుకోవాలి. సామ్రాజ్యవాద, నాటోయిజం వ్యతిరేక పోరాటాలను బలోపేతం చేయాలి. ప్రతిఘటనా బలాన్ని పెంచుకోవాలి. ఇందుకు ఆలశ్యం చేయడం సరి కాబోదు. మన దేశం నుంచి నాటోను పూర్తిగా పారద్రోలాలి. అన్ని స్థావరాలు, మొత్తం సైన్యాన్ని తరలిస్తే తప్ప స్వతంత్ర లౌకిక దేశం ఏర్పాటు కాదు' అని టర్కీ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సూచించింది.

1-3 తేదీల్లో పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ ఉత్సవాలు

లిస్బన్: 'ఇటువంటి పార్టీ మరొకటి లేద'న్న నినాదంతో 47వ అవాంతె ఉత్సవం (ఫెస్టా డో అవాంతె)ను పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ (పీసీపీ) సెప్టెంబరు 1,2,3 తేదీల్లో లిస్బన్‌లోని సెక్సల్ జిల్లాలో నిర్వహించబోతోంది. ఉత్సవంలో భాగంగా సంగీత కచేరిలు, రాజకీయ చర్చలు, సినిమా, థియేటర్, క్రీడలు తదితర ఎన్నో కార్యక్రమాలు జరగనున్నాయి. పోర్చుగల్‌కు చెందిన ప్రముఖ కళాకారులతో పాటు యూరప్, అమెరికా, లాటిన్ అమెరికా దేశాల ఉంచి కళాకారులు పాల్గొనున్నారు. పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ అధికారిక పత్రిక అవాంతె పేరుమీద ఈ ఉత్సావానికి అవాంతె ఉత్సావంగా నామకరణం జరిగింది. 1976 నుంచి సాంస్కృతిక, రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతీయువకులను ఈ ఉత్సవం ఆకర్షిస్తోంది. ప్రపంచ దేశాల కమ్యూనిస్టు యువ ప్రతినిధులు హాజరవుతారు. ఉత్సవం పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

ఏపీకి రూ.493 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

మణిపూర్‌కు రూ.18.80 కోట్లు, మేఘాలయకు రూ.27.20కోట్లు, మిజోరంకు రూ.20.80కోట్లు, త్రిపురకు రూ.30.40కోట్లు లెక్కన కేటాయింపులు జరిగాయి. కేంద్ర హోంశాఖ సిఫార్సు మేరకు ఎస్‌డీఆర్ నిధులను విడుదల చేసినట్లు ఆర్థికశాఖలోని వ్యయ విభాగం వెల్లడించింది. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు, సంభవిస్తున్న వరదల దృష్ట్యా కొన్ని నిబంధనలను సడలించినట్లు తెలిపింది. గత ఆర్థిక సంవత్సర నిధుల వినియోగ ధ్రువీకరణ కోసం ఆగకుండానే నిధులు విడుదల చేసినట్లు పేర్కొంది.

చంద్రయాన్-3కి రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సన్నాహాలను ముమ్మరం చేసింది. చంద్రునిపై పరిశోధనలు చేసేందుకు ఇస్రో 2008 అక్టోబర్ 24న 380 కోట్ల రూపాయల వ్యయంతో మొదటి ప్రయోగం చేసింది. చంద్రునిపై నీటిజాడలు ఉన్నాయని కనుగొని భారతదేశ సత్తాను ప్రపంచ దేశాలకు చాటింది. చంద్రునిపై మరింత పరిశోధనలు చేయాలని నిర్ణయించుకున్న ఇస్రో 2019 జులై 22న జీఎస్ఎల్వీ మార్క్..3 రాకెట్ ద్వారా చంద్రయాన్-2ను ప్రయోగించింది. 14 రోజుల పాటు అన్వేషణలు చేపట్టి చంద్రుని ఉపరితలంపై ఏమి నిక్షేపాలు, ఖనిజాలు లేదా మౌలిక వనరులు ఉన్నాయో తెలుసుకోవడానికి ప్రయత్నించింది. అయితే చంద్రయాన్-2 ప్రయోగం ద్వారా లూనార్ ఆర్బిటర్ సహాయంతో చంద్రుని కక్ష్యలో చేరాక ఇస్రో శాస్త్రవేత్తలు ప్లాన్ ప్రకారమే ఆర్బిటర్‌ను చంద్రునిపై నుండి ల్యాండర్ విడిపోయాయి... ఆ తర్వాత ల్యాండర్ చంద్రుడుపై కక్ష్య నుండి చంద్రుడు ఉపరితలం పైకి ప్రయాణం సాగించింది. ల్యాండరు చంద్రుడు ఉపరితలంపై నుండి రెండు కిలోమీటర్లు ఎత్తున ఉండగానే భూమితో సంబంధాలు తెగిపోయాయి. ఈ ప్రయోగం ఇస్రో శాస్త్రవేత్తలకు నిరాశ మిగిల్చింది. అయితే చంద్రయాన్-2 ప్రయోగం 90శాతం విజయం సాధించినట్లు ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. పట్టువీడని ఇస్రో చంద్రయాన్-3కి నడుంబిగించింది. చంద్రయాన్-1, చంద్రయాన్-2 ప్రయోగాలలో ఏయే సాంకేతిక లోపాలు తలెత్తాయో...వాటిని సున్నితంగా పరిశీలించింది. గతంలో తలెత్తిన సాంకేతిక లోపాలపై వివిధ పరిశోధనలు చేపట్టిన ఇస్రో శాస్త్రవేత్తలు... ఇప్పుడు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చంద్రయాన్-3 ప్రయోగం చేపట్టారు. ఈ ప్రయోగాన్ని విజయవంతం చేయడం ద్వారా ప్రపంచ దేశాల దృష్టి మరోసారి భారత్‌పైనా ప్రత్యేకించి శ్రీహరికోటలోని షార్ కేంద్రంపై పడేలా చేయాలని శాస్త్రవేత్తలు కృతనిశ్చయంతో ఉన్నారు. చంద్రయాన్-3 తర్వాత ఈనెల 23వ తేదీ ఉదయం 6.30 గంటలకు పీఎస్ఎల్వీ సి-57 రాకెట్ ప్రయోగం షార్‌లోని మొదటి వేదిక నుండి ప్రయోగించడానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఈ రాకెట్ ద్వారా సింగపూరు, మలేషియా వంటి దేశాల వాణిజ్య రాకెట్లను అంతరిక్షంలోకి చేర్చబోతున్నారు. చంద్రయాన్-3 ప్రయోగానికి సంబంధించి ఇస్రో చైర్మన్ సోమనాథ్ బుధవారం శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు.

యమునా నది ఉగ్రరూపం

ప్రమాదస్థాయిని దాటిన నీటి మట్టం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది మహోగ్రరూపం దాల్చింది. ఎగువన ఉన్న హరియాణా నుంచి వరద పోటెత్తడం వల్ల నది నీటిమట్టం ప్రమాదకరస్థాయిని దాటింది. దీంతో ఢిల్లీ ప్రభుత్వం అప్రమత్తమైంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించింది. ఇంటి నుంచి ప్రజలు బయటకు రావొద్దని కోరింది. అలాగే విద్యుత్ లైన్లకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. 45 ఏళ్ల క్రితం నాటి రికార్డును దాటి... చరిత్రలో తొలిసారి యమునా నది నీటిమట్టం ఆల్‌టైం గరిష్ఠానికి చేరింది. కేంద్ర జల కమిషన్ సమాచారం ప్రకారం.. బుధవారం మధ్యా హ్నం ఒంటి గంట సమయానికి ఢిల్లీ పాత రైల్వే బ్రిడ్జి వద్ద యమునా నది నీటి మట్టం 207.55 మీటర్లకు పెరిగింది. దీంతో ఢిల్లీలోని అనేక కాలనీల్లో వరద నీరు ముంచెత్తింది. ఇళ్లు, మార్కెట్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నది నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని ఓ అధికారి తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా దేశ రాజధానిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఢిల్లీ పోలీసులు 144 సెక్షన్ విధించారు. నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది సమూహంగా ఉండొద్దని తెలిపారు. అలాగే ప్రజలు విద్యుత్ లైన్లకు దూరంగా ఉండాలని ప్రభుత్వం కోరింది. 1978లో యమునా నది నీటి మట్టం 207.49 మీటర్లకు చేరడం వల్ల ఢిల్లీలో భీకర స్థాయిలో వరదలు సంభవించాయి. ఇప్పుడు ఆ రికార్డును కూడా దాటడం వల్ల అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే తీర ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయించారు. ఢిల్లీ సర్కార్ యమునా నది పరివాహక ప్రాంతాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. వారి కోసం శిబిరాలు ఏర్పాటు చేసి, ఆహారం, తాగునీరు అందించింది. యమునా నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుం డడం వల్ల ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్... అధికారులతో పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.

జగన్ మూర్ఖత్వానికి రాష్ట్రం బలి

(మొదటి పేజీ తరువాయి)

మహాశక్తి పథకం మహిళల జీవితాల్లో భారీమార్పులు తీసుకొస్తుందన్నారు.

కక్షపూరిత రాజకీయాలతో రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ

గతంలో ఒక విజన్‌తో హైదరాబాద్‌ను అభివృద్ధి చేశామని, ఆ ఫలితాలు మన కళ్ల ముందు స్పష్టంగా కనిపిస్తున్నాయని చంద్రబాబు చెప్పారు. అలాంటి రాజధాని మనకు ఉండాలని, పెట్టుబడులకు, ఉద్యోగాల కల్పనకు కేంద్రం కావాలని తాను అమరావతిని అభివృద్ధి చేస్తే...జగన్ తన కక్ష పూరిత రాజకీయాలతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆరోపించారు. ప్రజల ఆస్తిని నాశనం చేసే హక్కు జగన్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇప్పుడు రాజధాని కేసు డిసెంబర్‌కు వాయిదా పడిందని, అది ఎప్పుడు తేలుతుందో తెలియదన్నారు. రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టును జగన్ తన అసమర్థతతో నాశనం చేశారని ఆవేదన వెలిబుచ్చారు. పోలవరం పూర్తి అయి ఉంటే రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు నీరు పుష్కలంగా అందేదన్నారు. కియా పరిశ్రమను తెస్తే అక్కడ భూముల ధరలు పెరిగాయి...సంపద సృష్టి అంటే ఇదే కదా అన్నారు. ఒక మూర్ఖుడి నిర్ణయానికి తెలుగు జాతి బలి అవ్వాలా...దీనిపై జనం మౌనంగా ఉండాలా అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు జగన్‌పై ఉక్రోషంతో చేయడం లేదని, జరుగుతున్న నష్టం వల్ల ఆవేదనతో అంటున్నానని చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో నోట్ల పంపిణీకి, అక్రమాలకు చెక్ పెట్టాలంటే పెద్దనోట్ల రద్దు జరగాలని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ తప్పుడు పనులకు, రాజకీయ వ్యవహారాలకు పనిచేయడాన్ని చంద్రబాబు తప్పుపట్టారు. వలంటీర్లు ప్రభుత్వ సొమ్మును జీతంగా తీసుకుంటున్నారు...ప్రజలకు జవాబుదారీగా ఉండాలి... వారు ప్రభుత్వ సేవలకే పరిమితం కావాలి... కానీ, రాజకీయ పార్టీకి ఎలా పనిచేస్తారని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉంటుందా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా...తాను ఇప్పుడు పొత్తుల గురించి ఏమీ చెప్పలేనని, తనకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని చంద్రబాబు అన్నారు. జగన్ పాలనలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టాల్సిన అవసరం తనపై ఉందన్నారు. సీనియర్ రాజకీయ నేతగా అది తన బాధ్యత అని, ఒకవేళ ఆ పని సమర్థవంతంగా చేయలేకపోతే తరువాత ఆ బాధ తనకు ఎప్పటికీ ఉండి పోతుందని చంద్రబాబు చెప్పారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ చిట్‌చాట్‌లో మీడియా అడిగిన అనేక ప్రశ్నలకు చంద్రబాబు సమాధానాలు ఇచ్చారు. రాష్ట్రాన్ని కాపాడుకోవడంలో మీడియా భాగస్వామ్యాన్ని గుర్తుచేశారు. మీడియా వాళ్లు కేసులకో, ఒత్తిళ్లకో భయపడితే....రాష్ట్రానికి నష్టం చేసిన వాళ్లవుతారని చంద్రబాబు అన్నారు.

మరో 'వ్యాపమ్' స్కామ్?

(మొదటి పేజీ తరువాయి)

మందిలో ఏడుగురు ఒకే కేంద్రంలో పరీక్ష రాసినట్లు తెలిసింది. వీరంతా గ్వాలియర్‌లోని ఎన్ఆర్ఐ కాలేజీలో ఈ పరీక్ష రాశారు. టాపర్లుగా నిలిచిన వారి రోల్ నంబర్లు 2488 7991 నుంచి 2488 9693 మధ్యే ఉన్నాయి. అంటే ఒకే చోట పరీక్ష రాసిన దాదాపు 1700 మంది అభ్యర్థుల్లో ఏడుగురు టాప్ 10 జాబితాలో నిలిచారు. ఈ టాపర్లు జవాబుపత్రంలో హిందీలో సంతకం చేసి... పరీక్ష మాత్రం ఆంగ్లంలో రాసినట్లు మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో ఈ పరీక్ష నిర్వహణపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరీక్ష నిర్వహించిన కంపెనీని కేంద్ర ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. అయినప్పటికీ మధ్యప్రదేశ్ ఎంప్లాయిస్ సెలెక్షన్ బోర్డు పరీక్ష నిర్వహణ కోసం ఆ సంస్థకే టెండర్ అప్పగించినట్లు కథనాలు వచ్చాయి. దీనిపై స్టాఫ్ సెలెక్షన్ బోర్డు ఇంకా స్పందించలేదు. మరోవైపు టాపర్లు రాసిన పరీక్షా కేంద్రం బీజేపీ ఎమ్మెల్యే సంజీవ్ కుశ్వాహాకు చెందినదిగా తెలుస్తోంది. దీంతో ఇది రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. బీజేపీ హయాంలో మరోసారి వ్యాపమ్ కుంభకోణం జరిగిందని ప్రతిపక్ష కాంగ్రెస్ ఆరోపించింది. పట్వారీ పరీక్షను రద్దు చేసి...మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఈ ఆరోపణలను ఎమ్మెల్యే సంజీవ్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ముందు కావాలనే ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని ఎదురుదాడి చేశారు. 2013లో మధ్యప్రదేశ్‌లో బీజేపీ హయాంలో చోటుచేసుకున్న వ్యాపమ్ కుంభకోణం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ బోర్డు అధ్వర్యంలో నిర్వహించిన అనేక నియామక పరీక్షల్లో రాజకీయ నాయకులు, అధికారులు డబ్బు కోసం అక్రమాలకు పాల్పడినట్లు బయటపడింది. ఈ కుంభకోణంపై దాదాపు 1000 ఎఫ్ఐఆర్‌లు నమోదవ్వగా...చాలా కోర్టుల్లో కేసులు కొనసాగుతున్నాయి.

బీజేపీ, వైసీపీ పాలన నుంచి ప్రజల విముక్తి కోసమే

సీపీఐ బస్సు యాత్ర

పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ రెడ్డి

విశాలాంధ్ర-చిత్తూరు : ప్రజాకంతక బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను సాగనంపి దేశాన్ని, రాష్ట్రాన్ని రక్షించండి అనే నినాదంతో సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో జరిగే బస్సు యాత్రను జయప్రదం చేసేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి కోరారు. బుధవారం చిత్తూరులోని ఎస్టీయూ కార్యాలయంలో విజయ గౌరి అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోదీ, జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు ఏ మాత్రం అమలు చేయకపోగా ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ మతోన్మాద రాజకీయాలు, ధరలు పెరుగుదల, దళితులు, మహిళలపై దాడులు, రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాల వలన అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈసారి మోదీని సాగనంపేందుకు దేశంలోని సెక్యులర్ పార్టీలు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం పూర్తిగా హరించ వేయబడిందని, ప్రతిపక్షాలపై దాడులు పెరిగిపోతున్నాయని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్ మాట్లాడుతూ బీజేపీ పాలనలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు జీఎస్‌టీ పరిధిలోకి తీసుకువస్తే అన్ని వస్తువుల ధరలు తగ్గుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో పూర్తి వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అమ్మేస్తున్నారని, అంబానీ, అదానీకి వాటిని కట్టబెడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక చర్యలను ప్రోత్సహిస్తూ, కేంద్రానికి దాసోహం అయిందన్నారు. ప్రత్యేక హోదా, అమరావతి రాజధాని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయింపు తదితర విషయాల్లో వైఫల్యం చెందారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సీపీఐ ఆగస్టు 16 నుంచి సెప్టెంబరు 6 వరకు చేపట్టే బస్సు యాత్రను జయప్రదం చేసేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సహాయ కార్యదర్శి జనార్దన్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కోదండయ్య ఎం.సుబ్రహ్మణ్యం, గోపీనాథ్, సత్యమూర్తి, మణి, డి.చంద్ర, రమాదేవి, లక్ష్మి కుమారి, బాలాజీ రావు, రఘు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సాహిత్యవేత్త మిలన్ కుందేరా మృతి



పారిస్: కమ్యూనిస్టు పార్టీ బహిష్కృత నేత, అంతర్జాతీయ సాహిత్యవేత్త మిలన్ కుందేరా (94) కన్నుమూశారు. 'ది అన్‌బేరబుల్ లైట్‌నెస్ ఆఫ్ బీయింగ్' నవల ద్వారా మంచి ప్రాచుర్యం పొందిన ఈయన ప్రజా చైతన్య నవలలే కాకుండా కార్మికుల జవితాల్లో ఎదురయ్యే చేదు అనుభవాలను, మహిళలపై లైంగిక వేధింపులను వర్ణిస్తూ అనేక రచనలు చేశారు. మిలన్ కుందేరా దీర్ఘకాల అనారోగ్యంతో మంగళవారం పారిస్‌లో తుదిశ్వాస విడిచినట్లు ఆయన స్వస్థలమైన బర్నోలోని మిలన్ కుందేరా గ్రంథాలయం అధికార ప్రతినిధి గల్లిమర్డ్ బుధవారం వెల్లడించారు. 1967లో ది జోక్‌తో సాహిత్య లోకానికి కుందేరా పరిచయమయ్యారు. సోవియట్ నాటి పరిస్థితులపై 'సోషలిజం విత్ ల హ్యూమన్ ఫేస్' వంటి రచనలు చేశారు. 80 ఏళ్లు పైబడిన తర్వాత పారిస్‌లో స్థిరపడిన ఆయన 2015లో 'ది ఫెస్టివల్ ఆఫ్ ఇన్‌సిగ్నిఫికెన్స్'ను రచించారు. కుందేరా 1929, ఏప్రిల్ 1న చెకోస్లోవేకియాలోని బర్నోలో జన్మించారు. ప్రాగ్స్‌లో ఆయన విద్యాభ్యాసం సాగింది.. ఆపై కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఫ్రెంచ్ కవి అపోల్లినైరే కవితలను అనువదించడమే కాకుండా సొంత కవితలు రాశారు. 1950లో కమ్యూనిస్టు పార్టీ బహిష్కరణకు గురయ్యారు. 1956లో తిరిగి పార్టీలో చేరారు. ప్రాగ్ స్ప్రింగ్ సంస్కరణల ఉద్యమంలో పాత్ర ఉన్న ఆరోపణలతో 1970లో మరోసారి కమ్యూనిస్టు పార్టీ ఆయనపై వేటు వేసింది. 1975లో భార్య వెరాతో కలిసి ఫ్రాన్స్ వెళ్లిపోయి అజ్ఞాతవాసంలో గడిపారు. రెన్నెస్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నాలుగేళ్లు పనిచేశారు. 1979లో చెక్ పౌరసత్వాన్ని కోల్పోయారు.

కాంగ్రెస్‌తోనే దేశానికి మంచి రోజులు

గిడుగు రుద్రరాజు ఉద్ఘాటన

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజలు మార్పు కోరుకొంటున్నారని, రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని, కాంగ్రెస్‌తోనే దేశ ప్రజలకు మంచి రోజులు వస్తాయని కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సంఘీభావంగా ప్రాణ త్యాగం చేయడానికి కూడా సిద్ధమేనని స్పష్టంచేశారు. బీజేపీ, మోదీ చేస్తోన్న అన్యాయాలను ప్రశ్నిస్తున్నందుకే ఆయనపై అక్రమ కేసులు పెట్టి చట్ట సభల్లోకి రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రాహుల్‌కు సంఘీభావం తెలిపేందుకు బుధవారం విజయవాడ ధర్నా చౌక్‌లో మౌన సత్యాగ్రహాన్ని నిర్వహించారు. ఉమ్మడి 13 జిల్లాల పార్టీ శ్రేణులు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి సీడీ మయప్పన్, ఏఐసీసీ కార్యదర్శులు క్రిస్టోఫర్ తిలక్, సిరివెళ్ల ప్రసాద్, కేంద్ర మాజీ మంత్రులు చింతా మోహన్, జేడీ శీలం, పీసీసీ మీడియా కమిటీ చైర్మన్ తులసీరెడ్డి పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు భారీ ర్యాలీగా ధర్నా చౌక్‌కి చేరుకోగా జై కాంగ్రెస్, రాహుల్ నాయకత్వం వర్ధిల్లాలి వంటి నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించాయి. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు విలేకరులతో మాటాడుతూ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన గాంధీ, నెహ్రూ కుటుంబ సభ్యులను సీబీఐ, ఈడీ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రాహుల్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. 2019లో చేసిన వ్యాఖ్యలపై గుజరాత్ కోర్టు రాహుల్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధించడం 165 ఏళ్ల ఐపీసీ చరిత్రలో లేదన్నారు. బీజేపీకి చెందిన రూ.20వేలకోట్ల అక్రమ సంపాదన అదానీ గ్రూపుకు పెట్టుబడులు రూపంలో వెళ్లడంపై రాహుల్ పార్లమెంట్ సాక్షిగా ఎన్నోసార్లు ప్రశ్నించినా ఇప్పటి వరకు ప్రధాని మోదీ నుంచి కనీస స్పందన లేదని రుద్రరాజు అన్నారు. అదానీ గ్రూప్ అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఏర్పాటు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రధాన డిమాండ్ అన్నారు. దేశ న్యాయ వ్యవస్థపై విశ్వాసం ఉందని చెప్పారు.

ఏపీని అప్పుల ప్రదేశ్‌గా మార్చిన జగన్

(మొదటి పేజీ తరువాయి)

నెలకొంది. దీనికి తోడు రాష్ట్ర అభివృద్ధికి వెచ్చించాల్సిన మూలధన వ్యయాన్ని ఖర్చు పెట్టడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, ఇదేవిధంగా జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తే రాష్ట్రం దివాలా తీయడం ఖాయం. అప్పుల భారాలను పన్నులు, ధరవరల రూపంలో రాష్ట్ర ప్రజలపై మోపేందుకు ప్రభుత్వాలు ఉద్యుక్తమవ్వటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ తిరోగమన విధానాలకు సయ్యంటున్న జగన్ సర్కార్ వివిధ రూపాల్లో విద్యుత్ చార్జీలు, ఆస్తి, నీటి, చెత్త పన్నులు భారీగా పెంచి ప్రజలపై గుదిబండ మోపింది. కేంద్ర ప్రభుత్వ విధానాలకు దాసోహం అంటే ఏపీ అధోగతి పాలవ్వక తప్పదు. ఇకనైనా జగన్‌మోహన్ రెడ్డి కళ్లు తెరవాలి. అప్పుల యోచన మాని, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

26న విద్యుత్ ఉద్యోగుల

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు
- విద్యుత్ ఉద్యోగుల నూతన జేఏసీ ఏర్పాటు
- ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీగా నామకరణం

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): విద్యుత్ ఉద్యోగుల కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 26న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, టీఎన్‌టీయూసీ ఐక్య కార్మిక సంఘాల అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం దాసరి భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త పద్ధతిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇతర రంగాలలో పని చేస్తున్న ఉద్యోగుల కంటే ఎక్కువ జీతాలు విద్యుత్ ఉద్యోగులకు, కార్మికులకు ఇస్తున్నామని, అందువల్ల పీఆర్సీని రివర్స్ పీఆర్సీగా ఇవ్వాలని భావిస్తోందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న వాటికి కోత వేసి, కుదించాలనే పద్ధతిలో ఎనర్జీ సెక్రటరీ విజయానంద్, విద్యుత్ సంస్థ గురించి, ఉద్యోగస్తుల సాధక బాధలు తెలియని, అవగాహన లేని, కేవలం పంచాయితీలకే పరిమితమై శుద్ధ రాజకీయాలు చేసే విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నారని విమర్శించారు. వీరిద్దరి కుతంత్రం వలన విద్యుత్ కార్మికులు అయోమయ పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అనేకమంది విద్యుత్ కార్మికులను పర్మినెంట్ చేశారని, వేతనాలు పెంచారని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో అనేక సంవత్సరాలుగా వేతనాలు పెంచే పరిస్థితి లేదన్నారు. 2012 నుంచి పీఆర్సీలో ఎదుగుదల లేదని తెలిపారు. 2022 పీఆర్సీ ఇవ్వాల్సి ఉన్నా ఇవేమీ పట్టించుకోవట్లేదన్నారు. సంస్థలో కాంట్రాక్టు కార్మికులు 24 వేల మంది పని చేస్తుంటే సీఎం జగన్ 13,500 కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారని, వీరిలో పదివేల మందిని పర్మినెంట్ చేస్తానని చెప్పటం మోసం చేయటమేనని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని అన్ని సంస్థల్లో కలిపి సుమారుగా రెండు లక్షల మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారన్నారు. అవుట్ సోర్సింగ్‌లో 3 లక్షల మంది ఉన్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల వాగ్దానంగా పాదయాత్రలో విద్యుత్ కార్మికులందరినీ రెగ్యులరైజ్ అ చేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చినా చేయలేదని గుర్తు చేశారు. కేవలం పులివెందుల నియోజకవర్గంలో 39 మందిని కృష్ణపట్నం నుంచి తెచ్చి అవగాహన లేని వారికి దొడ్డిదారిన ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. జగన్ ప్రభుత్వానికి వత్తాసు పలికే అధికార యంత్రాంగం రాష్ట్రంలోని కార్మిక వర్గాన్ని, విద్యుత్ కార్మికులను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. ఏఐటీయూసీగా ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఐటీయూసీతో కలిపి అన్ని కార్మిక సంఘాలతో న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నామని స్పష్టం చేశారు. విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పని చేసే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు మూడవ ఏజెన్సీ పద్ధతి కాకుండా విద్యుత్ యాజమాన్యం ద్వారానే జీతాలు ఇవ్వాలని, పర్మినెంట్ ఉద్యోగస్తులకు పాత పెన్షన్ స్కీం విధానమే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మూడు డీఏ అరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఉద్యమానికి సమాయత్తం కావాలని ఉద్యోగ, కార్మికులకు పిలుపునిచ్చారు. తెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం నాయకుడు సాంబశివరావు మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగేంతవరకు పోరాటంలో భాగస్వాములు అవుతామన్నారు. విద్యుత్ రంగంలో కార్మికులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, పీఆర్సీ తదితర డిమాండ్లపై అలుపెరుగని పోరాటం చేస్తామని అన్నారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, తెలుగునాడు అనుబంధ కార్మిక సంఘం ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 129 సంఘం, విద్యుత్ శక్తి హెచ్155 యూనియన్ తదితర సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ముందుగా విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో విద్యుత్ రంగంలో పని చేస్తున్న ఐదు పర్మినెంట్ ఉద్యోగ సంఘాలు, ఆరు కాంట్రాక్టు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ ఉద్యోగుల నూతన జేఏసీ ఏర్పాటు చేశారు. జేఏసీకి 'ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ' గా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 129 వి.సుబ్బిరెడ్డి మధుసూదన్ రెడ్డి, హెచ్155 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్దేశ్వర రావు, కాంట్రాక్టు వర్కర్లు బాలకాశి సుదర్శన్ రెడ్డి, సూరిబాబు, పొన్నా శివయ్య, ఎస్.వెంకటరమణ, డి.మల్లికార్జునరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం కార్యదర్శి జమలయ్య డిమాండ్

విశాలాంధ్ర-వీరులపాడు: అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న జయంతి గ్రామానికి చెందిన చిలుకూరి పెంటారెడ్డికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషి యాని ప్రభుత్వం అందించాలని, మృతుడి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. వీరులపాడు మండలం జయంతి గ్రామంలో వరుసగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో ఆత్మహత్య చేసుకున్న పెంటారెడ్డి కుటుంబాన్ని రైతుసంఘం ప్రతినిధి బృందం బుధవారం పరామర్శించింది. ఆత్మహత్యకు కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుంది. గత మూడేళ్లుగా పెంటారెడ్డి తన కుమారుడు వెంకటరెడ్డితో కలిసి సుమారు 16.50 ఎకరాలు సాగుచేస్తున్నాడు. సొంత పొలం మూడు ఎకరాలు కాగా మిగిలినది కౌలుకు తీసుకుని పత్తి,మిర్చి, మొక్కజొన్న పంటలు పండించే వారు. మిర్చి ఎకరానికి రూ.1.50 లక్షల నుంచి 2లక్షలు, పత్తికి 35 వేల నుంచి 40వేలు, మొక్కజొన్నకు 25వేలు నుంచి 30వేలు వరకు పెట్టుబడి పెట్టగా గత 2020-2021 నుంచి వరసుగా నష్టాలు వస్తున్నాయి. గత మూడు సంవత్సరాలు వరసగా తెగుళ్లు, ప్రకృతి విపత్తుల వల్ల పంటలు దెబ్బతినటంతో దిగుబడులు తగ్గడం, పండిన పంటలకు కుదా గిట్టుబాటు ధరలు రాకపోవడంతో అప్పులతో పాటు వడ్డీలు కూడా పెరిగి పోయాయి. బ్యాంకు అప్పులు రూ.7లక్షలు కాగా మిగిలిన రూ.15లక్షలకు పైగా నూటికి రెండు రూపాయలకు వడ్డీకి అప్పులు తెచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం నుంచి కౌలుకు చేస్తున్న భూమికి గుర్తింపు కార్డు ఇవ్వలేదని, కౌలు భూమికి పంటరుణాలు లేవని, పంటలు నష్ట పోయిన సందర్భంలో విపత్తుల నష్ట పరిహారం, బీమా పరిహారం ఒక్క పైసా అందలేదని వివరించారు. అన్ని రకాలుగా నష్టపోవడంతో పెంటారెడ్డి జులై 3న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జులై 5న మరణించినట్లు కుటుంబ సభ్యులు రైతు సంఘం బృందానికి తెలిపారు. రైతు సంఘం నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల వల్లనే చిలుకూరి పెంటారెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని, ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, ఆ కుటుంబానికి ఉన్న పంట రుణాలు మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు చంద్ర మోహన్, తెలుగుదేశం నాయకులు చీదిరాల భారత రెడ్డి పాల్గొన్నారు.

పేదల కోసం సీపీఐ నిరంతర పోరాటం

జర్నలిస్టు ఉద్యమ నేత సోమసుందరం

విశాలాంధ్ర-నర్సీపట్నం: భారతదేశ చరిత్ర, సంస్కృతి, విభిన్న వర్ణాల కలయిక, దేశ సార్వభౌమత్వానికి పెట్టని కోటలుగా ఉన్నాయని సీనియర్ కమ్యూనిస్టు నాయకులు, జర్నలిస్టు ఉద్యమ నేత డీ సోమ సుందర్ అన్నారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో జరుగుతున్న సీపీఐ సైద్ధాంతిక,రాజకీయ శిక్షణ తరగతులకు సోమ సుందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశానికి విచ్చేసిన సీపీఐ కార్యకర్తలకు, నాయకులకు భారతదేశ చరిత్ర, సంస్కృతి అనే అంశంపై అయిన ప్రత్యేక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కార్మిక, కర్షకుల మనోభావాలను రెపరెపలాడించే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. పేదవాడి కలల సాకారం కోసం నిరంతరం కమ్యూనిస్టు భావజాలం పోరాడుతూనే ఉంటుందని చెప్పారు. విభిన్న సంస్కృతులు, భిన్న వర్ణాలు, దేశ సంస్కృతిలో అంతర్లీనమైనప్పటికీ సైద్ధాంతిక పరమైన ఆశయ సాధన కోసం సీపీఐ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవి సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, శిక్షణ తరగతుల మాస్టర్ సన్యాసిరావు, పెద్ద సంఖ్యలో సీపీఐ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ చెల్లించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కరపాటి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక నగరపాలక సంస్థ ఎదుట బుధవారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో

నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న మూడు నెలల హెల్త్ అలవెన్స్ బకాయిలను వెంటనే కార్మికులకు అందజేయాలన్నారు. సచివాలయం కార్యదర్శులు కార్మికులపై పెత్తనం చేయడాన్ని వారు తప్పు పట్టారు. మరణించిన కార్మికుల కుటుంబంలోని ఓ వ్యక్తికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ బీ చంద్రయ్యకు వినతి పత్రం అందజేశారు. దానికి స్పందించిన కమిషనర్... సంబంధిత అధికారిని ఆయన చాంబర్లోకి పిలిచి కార్మికుల హెల్త్ అలవెన్స్ విషయమై అడగ్గా రెండు నెలల బకాయలు వెంటనే చెల్లిస్తామని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో హెల్త్ అలవెన్స్ చెల్లింపు చేస్తామని నేతలకు కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యర్రంశెట్టి ఈశ్వరరావు, ఎర్రంశెట్టి దుర్గాప్రసాద్, వై.శ్రీనివాసరావు, జి.రమణ, కరపాటి కుమార్ స్వామి, ఎస్ దుర్గారావు, సంగం రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్ స్పెషలైజేషన్‌పై

వీఐటీతో ఐఎస్‌డీసీ ఎంవోయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : డిజిటల్ మార్కెటింగ్ స్పెషలైజేషన్‌ను అభ్యసిస్తున్న బీబీఏ విద్యార్థులకు డిజిటల్ మార్కెటింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఐఎస్‌డీసీ సర్టిఫికెట్‌ను అందజేసేలా వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం ఆ సంస్థతో బుధవారం అవగాహనా ఒప్పందం చేసుకుంది. బి.కామ్ (ఫైనాన్స్) అభ్యసిస్తున్న విద్యార్థులకు ఏసీసీఏ ఫౌండేషనల్ లెవెల్ సర్టిఫికేషన్ కోసం అన్ని పేపర్ల మినహాయింపుతో పాటు ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ అవసరమైన 9 పేపర్ల మినహాయింపుతో కేవలం 4 పేపర్లు పూర్తి చేస్తే ఏసీసీఏ ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ పొందే వీలు కలుగుతుంది. ఈ సందర్భంగా

వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.వి.కోటా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ప్రొఫెషనల్ సర్టిఫికేషన్స్ అందించటంలో విట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు అందరూ వినియోగించుకొని ప్రయోజనం పొందాలని ఆకాంక్షించారు. ఐఎస్‌డీసీ సౌత్ జోనల్ హెడ్ రాజేష్ పూనియా మాట్లాడుతూ డిజిటల్ మార్కెటింగ్, ఫిన్‌టెక్ రంగాలలో ఐఎస్‌డీసీ సర్టిఫికెట్ ప్రాముఖ్యతను తెలియజేశారు. కోర్సుకు సంబంధించి 140 గంటల డిజిటల్ మార్కెటింగ్ ఫండమెంటల్స్, ఇన్‌బౌండ్, అవుట్‌బౌండ్ మార్కెటింగ్, ఎస్ఈవో వెబ్, సోషల్ మీడియా అనలిటిక్స్ టాపిక్స్ కవర్ చేయబడతాయని చెప్పారు. ఫిన్‌టెక్ సర్టిఫికెట్ 250 గంటల్లో 2 సెమిస్టర్‌ల కంటెంట్ అయిన బిజినెస్ అండ్ టెక్నాలజీ, ఫిన్‌టెక్, ఫిన్‌టెక్ అప్లికేషన్ ఇన్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫిన్‌టెక్ యాప్‌ల టాపిక్స్ కవర్ అవుతాయని వివరించారు. వీఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ ఫిన్‌టెక్ సర్టిఫికేషన్ బీటెక్ విద్యార్థులకు కూడా ప్లేస్‌మెంట్ అవకాశాలను మెరుగుపరచటంలో సహాయపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ డాక్టర్ ఎస్.ఎస్.శాంతకుమారి, అసోసియేట్ డీన్ డాక్టర్ రాఘవేంద్ర, అఖిల్ అగర్వాల్ (ఐఎస్‌డీసీ ఏపీ, తెలంగాణ రీజనల్ మేనేజర్), డా. శివకుమార్ (బీబీఏ ప్రోగ్రామ్ చైర్), డాక్టర్ గోపాలకృష్ణ యూఎం (బీకామ్ ప్రోగ్రామ్ చైర్) తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు

మధ్యాహ్న భోజనం కొనసాగించాలి

ఏఐఎస్ఎఫ్ డిమాండ్ ఖాళీప్లేట్లతో నిరసన

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శివారెడ్డి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద బుధవారం ఖాళీ ప్లేట్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్... అధికారంలోకి రాకముందు పేద విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకెళ్తానని, ప్రపంచ స్థాయి లాంటి శిక్షణను విద్యార్థులకు ఉచితంగా ఇస్తానని, ప్రగల్భాలు పలికారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఎందుకు ఉచితంగా ఇవ్వరో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గత సంవత్సరం వరకు ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం... ఈ సంవత్సరం నుండి విద్యార్థుల దగ్గర రూ.1185 వసూలు చేయడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీశారు. కళాశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పాఠ్య పుస్తకాలు లేక పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాగా 2012 నుంచి ఇంటర్ విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని వైసీపీ ప్రభుత్వం ఈ సంవత్సరం నుండి రద్దు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాలలో చదువుతున్న విద్యార్థులు ఆకలితో అలమటించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఇంటర్ బోర్డ్ కార్యాలయాన్ని, విద్యాశాఖ మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎం సాయి కుమార్, ఆఫీస్ చందు, సుధీర్, మొబీనా, అయ్యప్ప, నాయకులు ప్రవీణ్, బన్నీ, సాయి కుమార్, దుర్గాప్రసాద్, కృష్ణమోహన్ , రంజిత్ , సాయి, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత గల కమ్యూనిస్టు దగాని సంగీతరావు

విశాలాంధ్ర-కూచిపూడి: తుది శ్వాస వరకు ఎర్రజెండా నీడలో పయనించి సమస్యలపై పోరాటం సల్పిన సీపీఐ నాయకుడు కామ్రేడ్ దగాని సంగీతరావు స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమని వక్తలు తెలిపారు. సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి, ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు దగాని సంగీతరావు సంతాప సభ బుధవారం ఆయన స్వగ్రామమైన కృష్ణాజిల్లా మొవ్వ మండలంలోని కాజ గ్రామ శివారు మట్ల మాలపల్లిలో నిర్వహించారు. పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రముఖులు పాల్గొని సంగీతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సంగీతరావు మృతి ఆయన కుటుంబానికే కాకుండా పార్టీ కూడా తీరనిలోటని తెలిపారు.

కృష్ణాజిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు కోదాటి నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా సంగీతరావు పార్టీ సిద్ధాంతాలను, విధానాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి అనేక మంది హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. ఆర్థిక అసమానతలు కలిగిన ఈ సమాజంలో సమస్యల పైన దృష్టి సారించడం, వాటి పరిష్కారం కోసం తపనపడే వారని తెలిపారు. చిరునవ్వులు చిందిస్తూ మృదుస్వభావిగా పేరుగాంచిన సంగీతరావు జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. ఆయన మరణించిన ముందు రోజు కూడా పార్టీ పిలుపు మేరకు కాజ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారని గుర్తు చేశారు. ప్రజానాట్య మండలి కృష్ణాజిల్లా కన్వీనర్ కోసూరు వెంకట అప్పారావు స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, పార్టీ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, జిల్లా ఇన్‌ఛార్జ్ కార్యదర్శి టి.తాతయ్య, కృష్ణాజిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షులు తాతినేని పూర్ణచంద్రరావు, కృష్ణాజిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మెరుగు విజయకుమార్, మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్స్, సీపీఐ మొవ్వ మండల కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, పాస్టర్ కె.వి.ఆర్, పరుచూరి అజయ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మద్దుల బసవరావు, ఆర్.మురహరరెడ్డి, అరసం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్, కృష్ణాజిల్లా రైతు సంఘం అధ్యక్షులు హనుమాసుల సురేంద్రనాథ్ బెనర్జీ, గ్రామ శాఖ కార్యదర్శులు కొండా నాగేశ్వరరావు (కూచిపూడి), బోరుకాటి నరసింహారాజు (కోసూరు), కార్యకర్తలు బల్ల సుబ్బారావు, పాతపాటి ప్రసాద్, దళపతిరావు వెంకటరామరాజు, లింగమనేని వెంకటేశ్వరరావు, లక్ష్మీపతి తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని చిత్రపటం వద్ద పూలు జల్లి నివాళులర్పించారు. తొలుత సంగీతరావు మృతికి సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అలాగే సంగీతరావు అల్లుడు, ప్రజానాట్యమండలి కళాకారుడు పిడిగే సుందరరావు, శ్రీనివాస్, కోసూరు వెంకట అప్పారావు అనేక గీతాలు ఆలపించి నివాళి అర్పించారు.

పదవులు రానివారికి న్యాయం చేస్తాం

విజయసాయిరెడ్డి భరోసా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ పదవులు ఇచ్చి అవకాశాలు కల్పించారని వైసీపీ ఏపీ సమన్వయకర్త విజయసాయిరెడ్డి అన్నారు. వివిధ నియోజక వర్గాలలో పదవులురాని ఒకరిద్దరికి న్యాయం జరిగేలా పార్టీ చర్యలు తీసుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి నేతృత్వంలో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నాయకులతో సమావేశంలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అనంతరం వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, ప్రజలను కలిసి వారి నుంచి వినతులను విజయసాయిరెడ్డి స్వీకరించారు. ఇదిలావుంటే, ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రకాల పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో సీఎం జగన్ పునరుద్ఘాటించారని విజయసాయిరెడ్డి తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో తీసుకున్న ఈ నిర్ణయం ప్రైవేట్ సహా అన్ని రకాల పరిశ్రమల్లో సమర్థంగా అమలు కావాలని ఆదేశించారన్నారు. దీనిని కలెక్టర్లు పర్యవేక్షించాలని, ఆరు నెలలకొకసారి నివేదిక ఇవ్వాలని సూచించినట్లు తెలిపారు. రూ.13,295 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు కానున్న వివిధ పరిశ్రమల్లో 10,181 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిందని విజయసాయి రెడ్డి వెల్లడించారు. భూముల రీసర్వే తొలి దశలో 2,000 గ్రామాల్లో రీసర్వే పూర్తయినట్లు తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా ఆ గ్రామాలకు డిజిటల్ రికార్డులు చేసినట్లు తెలిపారు.

అవినీతికి కేంద్రాలుగా సచివాలయాలు

ప్రతి పనికి ఓ రేటు - సంక్షేమ పథకాలకూ తప్పని ముడుపులు

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అడ్మిన్ భాస్కరరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: గ్రామ సచివాలయాలు అవినీతికి కేంద్రాలుగా మారాయి. లంచం ముట్టనదే పని ముందుకు సాగని స్థితి సచివాలయాల్లో ఉంది. దీనిపై ప్రజలు పెద్దఎత్తున ఫిర్యాదు చేస్తున్నారు. ఇంటి పన్ను వేయాలన్నా, ఖాళీ స్థలానికి పన్ను (వీఎల్‌టీ) విధించాలన్నా, ఇంటి నిర్మాణప్లాను అనుమతి పొందాలన్నా, ఇంటి పన్ను పేరు మార్చాలన్నా, నీటి కొళాయి మంజూరు కావాలన్నా, జగనన్న నవరత్నాల పథకంలో ఏ పథకంలోనైనా అర్హులను చేర్చాలన్నా, కుల, ఆదాయ, మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నా ప్రతి పనికి ఓ రేటును కట్టాల్సిందే! పేదవాడు 60 గజాల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలంటే ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ప్లానింగ్ కార్యదర్శి సైట్ విజిట్ చేయడానికి కనీసం రూ.2 వేలు, ప్లాన్ మంజూరు చేయడానికి ఎలాంటి కొర్రీలు, లోపాలు లేకుండా ఆమోదానికి సిఫార్సు చేయాలంటే స్థలం విస్తీర్ణం- భవన నిర్మాణ స్వరూపాన్ని బట్టి ముడుపులు ఇవ్వాల్సిందేనని భవన నిర్మాణదారులు చెబుతున్నారు. ఖాళీ స్థలం కొనుక్కుంటే దానికి పన్ను వేయాలంటే విస్తీర్ణాన్ని బట్టి రేటు చెబుతారన్నారు. తాజాగా విశాఖ జిల్లా అగనంపూడి వద్దగల ప్రశాంతి నగర్ సచివాలయ అడ్మిన్ భాస్కరరావు రూ.20వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అగనంపూడి ప్రాంతానికి చెందిన ఓ ఫిర్యాదిదారుడు ప్రశాంతనగర్ సచివాలయానికి వెళ్లి ఇంటి పన్ను కోసం దరఖాస్తు ఇవ్వగా దానిని పరిశీలించి, ఆమోదించేందుకు రూ.40వేలను భాస్కరరావు డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేమని చెప్పి రూ.20వేలకు అర్జీదారుడు ఒప్పించారు. ఇదే క్రమంలో మంగళవారం సాయంత్రం ఏబీసీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా భాస్కరరావు పట్టుకున్నారు. గ్రేటర్ విశాఖపట్నంలో 572 సచివాలయాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సచివాలయాల్లోనూ ముడుపులతోనే పని జరిగే పరిస్థితి ఉందని ప్రజలు అంటున్నారు. విశాఖలో ముఖ్యంగా ప్లానింగ్ కార్యదర్శులు బహిరంగంగానే లంచం డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదిదారులు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రతి పనికి ఓ రేటు కట్టి సచివాలయాల వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార వైసీపీ వర్గాల్లోనూ సచివాలయ ఉద్యోగుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి నెలకొంది.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు తూట్లు పొడిచేలా ప్లానింగ్ కార్యదర్శులు వ్యవహరిస్తున్నారని వార్డు కార్పొరేటర్లే ఫిర్యాదులు చేయడం గమనార్హం. తమను కాదని సర్వాధికారాలు సచివాలయ ఉద్యోగులకే ఇవ్వడంపై ప్రభుత్వ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంపాదకీయం

తృణమూల్‌కు ఉత్సాహాన్నిచ్చిన విజయం

పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల ఫలితాలు దాదాపు ఏకపక్షంగానే ఉన్నాయి. 2024లో లోకసభకు ఎన్నికలు జరగడానికి ముందు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ సాధించిన అసాధారణ విజయం ఎంతో ప్రోత్సాహాన్నిచ్చింది. రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల మధ్య హింసాయుత ఘర్షణలు జరిగి చాలామంది హతులవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు సవాలుగా నిలుస్తుంది. ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి ప్రధాన పార్టీలు ఇటీవల కాలంలో సహకరించడంలేదు. ఈ ఎన్నికల్లో గణనీయమైన సీట్లు గెలవడానికి బీజేపీ అన్ని విధాలుగా ప్రయత్నించినప్పటికీ విఫలమైంది. ఈసారి సీపీఎం, కాంగ్రెస్, ఇస్లామిక్ ఫ్రంట్ ఒక కూటమిగా కలిసిపోటీచేసి కొన్ని చోట్ల తృణమూల్ కాంగ్రెస్, బీజేపీలను వెనక్కునెట్టాయి. అక్కడకూడా ఈ పార్టీలు విజయం పొందాయి. ముఖ్యంగా ముషీరాబాద్, మాల్టా ప్రాంతాల్లో వామపక్షం, కాంగ్రెస్‌లు కొన్ని సీట్లు గెలుచుకున్నాయి. ఈ ఫలితాలు వామపక్షం, కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం నింపాయి. ఈ రెండు ప్రాంతాల్లో 2021 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని తృణమూల్ కాంగ్రెస్ తిరిగి సాధించలేకపోయింది. దాదాపు అన్ని ప్రాంతాల్లో బీజేపీకి నిరాశ ఎదురైంది. అసెంబ్లీ ఎన్నికల్లోనైై ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షాలు విస్తృతంగా పర్యటించి తమ పార్టీ అఖండ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. డాంబికాలు పలికి తీవ్ర అవజయాన్ని చవిచూసింది. రానున్న లోకసభ ఎన్నికల్లోనూ పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ పెద్దగా ఆశ పెట్టుకోవడానికి అవకాశమేలేదని పంచాయతీ ఎన్నికల ఫలితాలు సంకేతాలనిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌ను చీల్చి బీజేపీని బలోపేతం చేయాలన్న లక్ష్యం ఇప్పట్లో నెరవేరదు. లోకసభ ఎన్నికల్లో ప్రతిపక్షాల ఫ్రంట్ పోటీ చేయడానికి నిర్ణయానికి వచ్చాయి. తాజాగా మరికొన్ని ప్రతిపక్షాలు ఈ ఫ్రంట్‌లో చేరడంతో ఫ్రంట్ మరింత బలోపేతమైంది.ఈ నెల 17,18 తేదీలలో బెంగళూరులో జరగనున్న ప్రతిపక్ష సమావేశంలో మొత్తం 23పార్టీలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నాయి. ఫ్రంట్ పేరును, సీట్ల సర్దుబాటును చర్చించి నిర్ణయించే అవకాశంఉంది. పంచాయతీ ఎన్నికల్లో తీవ్ర అక్రమాలు జరిగినందున వాటిని రద్దుచేసి తిరిగి ఎన్నికలు జరపాలని, ఎన్నికల కమిషనర్‌ను తప్పించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. బీజేపీ తరఫునే పిటిషన్లు వేశారనే విషయం తిరస్కరించలేనిది. బీజేపీ ఎన్నిఎత్తులు వేసినా దాని ప్రయత్నాలు ఫలించే పరిస్థితులు లేవు. రాష్ట్రంలో శాంతి భద్రతలు నశించాయని రాష్ట్ర గవర్నర్ కేంద్రానికి నివేదిక పంపినా పెద్దగా ఫలితం ఉండదు. సార్వత్రిక ఎన్నికలు మరికొన్ని నెలల్లో జరగనున్నందున ఇప్పుడు బెంగాల్‌లో ప్రభుత్వాన్ని రద్దుచేసి, రాష్ట్రపతి పాలన విధిస్తే అది బీజేపీకే ఎదురుదెబ్బ అవుతుంది. దేశవ్యాప్తంగా బీజేపీ నరేంద్ర మోదీపైన వ్యతిరేకత ప్రబలంగా ఉందన్న విశ్లేషణల నేపథ్యంలో ఆ పార్టీపై వ్యతిరేకత మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రతిపక్షాలన్నీ కలిసి మోదీ పాలనలో చోటు చేసుకున్న వైఫల్యాలను, ప్రజావ్యతిరేక విధానాలను దేశమంతటా ప్రచారం చేస్తాయి. ఈ చర్య తీసుకుంటే ఇప్పటికే ఈసారి లోకసభ ఎన్నికల్లో విజయం సాధించడం సాధ్యం కాదన్న ఆలోచనలో మోదీ–షా ద్వయాలను మరింత ఆందోళనకు గురిచేస్తుంది.

పంచాయతీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి రాజకీయ ఆధిపత్యాన్ని ప్రదర్శించిన తృణమూల్ కాంగ్రెస్ నేత, ముఖ్యమంత్రి మమతబెనర్జీ లోకసభకు జరిగే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్న లక్ష్యం నెరవేర్చేందుకు అత్యంత సర్దుబాటు వైఖరిని చూపవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రతిపక్షాల ఐక్యత కోసం మొదట మమత ప్రయత్నించి ఆ తర్వాత ఒంటరిగానే పోటీ చేస్తానని ప్రకటించారు. గతంలో ఆమె ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీని కలిసి చర్చించారు కూడా. ఇది జరిగిన కొద్దికాలానికే వైఖరి మార్చుకున్నారు.

కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లిఖార్జున్‌ఖర్గే ఎన్నికైన తర్వాత, మళ్లీ ప్రతిపక్ష ఐక్యతకు గట్టిగా నిలిచి, పట్నాలో జరిగిన ప్రతిపక్షాల సమావేశాన్ని నిర్వహించడానికి క్రియాశీలంగా తన పాత్ర నిర్వహించారు. అయితే పంచాయతీ ఎన్నికల్లో సాధించిన విజయం నేపథ్యంలో ప్రతిపక్షాలకు భంగం కలగకుండా నడుచుకోవలసిన బాధ్యత ఉందని మరువరాదు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 79శాతం ఓట్లు తృణమూల్ కాంగ్రెస్‌కు లభించాయి.

పంచాయతీ ఎన్నికల్లో ఘన విజయం ప్రజాభిప్రాయం అత్యధికంగా తృణమూల్ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంది. అసెంబ్లీ, లోకసభకు జరిగే ఎన్నికలకు, పంచాయతీ ఎన్నికల ఓటర్ల అభిప్రాయాలు మారవచ్చు. కానీ, పాలకపార్టీ ఓటమిచెందే పరిస్థితులు రాష్ట్రంలో లేవు. తృణమూల్ కాంగ్రెస్ నుంచి తమ పార్టీలోకి రప్పించుకున్న సుభేందు అధికారి పార్టీని బలోపేతం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో మమత వ్యక్తిగత పలుకుబడి, ప్రభావం ఓటర్లపై ఉందని భావించవచ్చు. దక్షిణ 24పరగణా జిల్లాలోని భంగ్‌నగర్ ప్రాంతంలో ఎక్కువగా ముస్లింలున్నారు. వామపక్షం, కాంగ్రెస్, ఇస్లామిక్ ఫ్రంట్ కలిసి ఏర్పడిన ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ ఈ ప్రాంతంలోని మొత్తం 132 సీట్లలో 43 సీట్లు గెలుచుకుని గణనీయమైన విజయం సాధించింది. ఈ ప్రాంతంలో గతంలో మంచి పట్టున్న మమతబెనర్జీ ప్రభావం తగ్గిందని ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్ సాగర్దిఘి అసెంబ్లీ నియోజకవర్గంలో గెలుపొందిన తర్వాత ముస్లింలు తృణమూల్ కాంగ్రెస్‌కి దూరమవుతున్న ధోరణి కనిపించింది. పంచాయతీ ఎన్నికలు కూడా ఈ విషయాన్నే స్పష్టం చేశాయి. అందువల్ల గెలిచిన పార్టీ విజయాన్ని ఆనందించవచ్చుగానీ విర్రవీగడం సరైందికాదు. ఈ విషయంలో బీజేపీ ఇతర పార్టీలకంటే ముందుంటుంది. మితిమీరిన అహంభావం ప్రదర్శిస్తూ సామాన్య ప్రజలను పట్టించుకోకుండా, కార్పొరేట్లను మరింత సంపన్నులను చేస్తున్న మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పకపోరు.

వైఎస్ఆర్ నేతన్న నేస్తం కార్మికులందరికీ అమలు చేయాలి

శిరందాసు నాగార్జున

దేశంలో ప్రాధాన్యం కలిగి, అత్యధిక మందికి ఉపాధి కల్పించేది చేనేత రంగం. స్వాతంత్ర్యోద్యమంలో కూడా ఈ రంగం కీలకపాత్ర పోషించింది. భారతీయ చేనేత వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. చేనేత మనదేశ ఆర్థిక వ్యవస్థ బలపడటంలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రభుత్వాలు మాత్రం ఈ రంగం అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వడంలేదు. దేశంలో, రాష్ట్రంలో ఎన్ని చేనేత మగ్గాలు ఉన్నాయో, ఎంతమంది చేనేత కళాకారులు లేక కార్మికులు ఉన్నారో లెక్కలు తేల్చలేకపోయాయి. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే అన్ని రాజకీయ పార్టీలకు చేనేత వర్గాలు గుర్తుకు వస్తాయి.

ఆంధ్రప్రదేశ్‌లో చేనేత మగ్గంనేసే కార్మికులు దాదాపు 3 లక్షల మంది వరకు ఉన్నారు. దేశంలో అత్యధిక మంది చేనేత రంగంపై జీవిస్తున్నవారు ఏపీలోనే ఉన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఆంధ్రప్రదేశ్‌లో చేనేత సహకార సంఘ సభ్యులు 2,00,310 మంది ఉన్నారు. సహకార సంఘాలలోలేని కార్మికులు 1,58,902 మంది ఉన్నారు. అంటే మొత్తం దాదాపు 3.60 లక్షల మంది ఉన్నారు. ఇందులో ఓ లక్ష మంది చిలపలు ఎలిచేవాళ్లు, కండెలు చుట్టేవాళ్లు, అచ్చులు అతికేవాళ్లు ఉన్నా, 2.60 లక్షల మంది చేనేత కార్మికులు ఉంటారు. వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం కింద 81,700 మంది మాత్రమే లబ్ధి పొందుతున్నారు. అంటే ఇంకా 1,78,300 కార్మికులకు ఈ పథకం అందడంలేదు. ఈ పథకం వర్తించడానికి రూపొందించిన నిబంధనలు కూడా చాలా విచిత్రంగా ఉన్నాయి. సొంత ఇల్లు లేక అద్దెకు ఉండే ఇంట్లో మగ్గం ఉన్న కార్మికులకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేశారు. ఇల్లు లేక మగ్గం పట్టేంత ఇంటికి అద్దె చెల్లించలేక మగ్గాల షెడ్లలో నేతనేసే నిజమైన చేనేత కార్మికులకు మాత్రం ఈ పథకం వర్తించడంలేదు. వారు ఈ పథకం కింద లబ్ధి పొందలేక పోతున్నారు. ప్రభుత్వం దృష్టిలో వారు చేనేత కార్మికులు కారు. చేనేత కార్మికులను శాస్త్రీయంగా గుర్తించే విధానాన్ని ఏ ప్రభుత్వం(అది ఏ పార్టీ అయినా) అనుసరించలేదు. ఆ ఆలోచన కూడా ఏ ప్రభుత్వం చేయలేదు. రాజకీయ పార్టీలకు గాని, ప్రభుత్వాలకు గాని చిత్తశుద్ధి ఉంటే ఒక్క నెలరోజుల స్పెషల్‌డ్రైవ్ ద్వారా చేనేత కార్మికులను శాస్త్రీయంగా లెక్కించవచ్చు. చేనేత, సహకార వంటి సంబంధిత శాఖల అధికారులు మండలాల వారీగా ప్రతి చేనేత కార్మికుని ఇంటికి, ప్రతి సొసైటీకి, ప్రతి చేనేత షెడ్డు వద్దకు వెళ్లి మగ్గాలను ప్రత్యక్షంగా పరిశీలించి, ఆ మగ్గాలను నేసే స్త్రీ, పురుష కార్మికులను గుర్తించాలి. అలాగే, పండుగుల సాగుల వద్దకు, ఆసుల వద్దకువెళ్లి అక్కడ పనిచేసే కార్మికులను గుర్తించాలి. చేనేత కార్మికులుగా వారికి అధికారికంగా ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలి. ఆ కార్డుల ద్వారా వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను పొందే అవకాశం కల్పించాలి. ఈ విధంగా లెక్కతేల్చి, వారికి గుర్తింపు కార్డులు ఇచ్చిన నాడే వారికి న్యాయం చేసినవారవుతారు. గతంలో కేంద్రప్రభుత్వం కార్వే సంస్థ ద్వారా సర్వే చేయించి కొంతమందికి కార్డులు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా హ్యాండ్లూమ్‌శాఖ ద్వారా గుర్తింపు కార్డులు ఇచ్చింది. కానీ, ఇప్పుడు వారికి పథకాలు వర్తించడంలేదు. అంటే, ప్రభుత్వం కార్డులు ఇచ్చినా ప్రయోజనం లేకుండాపోయింది.

కేంద్ర ప్రభుత్వం 2014 తర్వాత నేషనల్ హ్యాండ్లూమ్ బోర్డ్, హెూం ఫర్ వర్క్‌షెడ్, మార్కెటింగ్ ఇన్సెంటివ్, చేనేత కార్మికులకు ఎంతో ప్రయోజనకరమైన మహాత్మాగాంధీ బంకర్ బీమా వంటి పథకాలను రద్దుచేసింది. దేశంలో నూలు ఉత్పత్తిచేసే స్పిన్నింగ్ మిల్లులు 40 శాతం చిలపనూలును గతంలో చేనేత అవసరాలకోసం సరఫరా చేసేవారు. ఇప్పుడు దాన్ని 15శాతానికి తగ్గించారు. దీంతో నూలుధరలు పెరిగాయి. ముడి సరుకు అందుబాటులో లేకపోవడంతో చేనేతవృత్తికి తీరనిఅన్యాయం జరుగుతోంది. లక్షాలాదిమంది జీవిస్తున్న చేతివృత్తి ద్వారా తయారయ్యే చేనేత వస్త్రాలపై కేంద్రం 5 శాతం జీఎస్టీ విధించడం అత్యంత దారుణం. అంతే కాకుండా, చేనేతకు ఉపయోగించే నూలుకు వేసే రంగులు, రసాయనాలపై 18 శాతం జీఎస్టీ విధించారు. చేనేతపై జీఎస్టీ రద్దు చేయాలని, రద్దు చేసిన చేనేతకు సంబంధించిన పథకాలను పునరుద్ధరించాలని, చేనేతవృత్తి చేస్తూ 80 సంవత్సరాలుపైబడి మరణించిన చేనేత కార్మికుల కుటుంబాలకు కేంద్రం మత్స్యకారులకు ఇచ్చే విధంగానే ఐదు లక్షల రూపాయల బీమా వర్తింపచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సీనియర్ జర్నలిస్ట్, 9440222914

ముందే కూస్తున్న 'ఎన్నికల కోడి'

మక్కెన సుబ్బారావు

లోకసభకు 2024లో జరగనున్న ఎన్నికలవేడి అప్పుడే మొదలైంది. తెలంగాణ అసెంబ్లీకి నాలుగు నెలల్లో మూడవ పర్యాయం ఎన్నికలున్నందున పాలక ప్రతిపక్షపార్టీలు హడావుడిగా ఉన్నాయి. అదే సమయంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, మిజోరం అసెంబ్లీలకూ ఎన్నికలు జరగనున్నాయి. లోకసభ ఎన్నికలకు ఎంతో సమయమునప్పటికీ పాలక, ప్రతిపక్షాలు వ్యూహ, ప్రతివ్యూహాలు పన్నుతున్నాయి. ఇంట్లో ఈగల మోత–బైట పల్లకీమోతగా ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం పెనుపరీక్షకు గురికానుంది. వరుసగా మూడవసారి విజయం సాధించి హాట్రిక్ కొట్టడం బేజేపీ–ఆర్‌ఎస్‌ఎస్ తక్షణ లక్ష్యం. మత విభజనను ఉద్రేకంచేయడం ద్వారా, విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థల దన్నుతో, ధనసంపత్తితో, విదేశీ నేతల ప్రశంసలకు విరివిగా ప్రచారమివ్వడం (మోదీ ప్రపంచనేత, శాంతిదూత భజన అందులో భాగమే) ద్వారా ప్రజలను ఆకర్షించడం బీజేపీ ఎన్నికల వ్యూహంలో ప్రధానాంశం. ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి)కి చట్ట రూపమిచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఈ నేపథ్యంలోనే చూడాలి. అది రాజ్యాంగం ఆదేశిక సూత్రాల్లో, జనసంఘ్ కాలం నుండి ముస్లిలంకు వ్యతిరేకంగా బీజేపీ ఎజెండాలో ఉన్నమాట వాస్తవం. అయోధ్యలో రామాలయం నిర్మాణ, కశ్మీర్‌కు సంబంధించి ప్రత్యేక పరిస్థితుల్లో ప్రత్యేక హోదా కల్పిస్తూ రాజ్యాగం ఆర్టికల్ 370 కింద ఇచ్చిన హామీని రద్దుచేయడం, ఉమ్మడి పౌరస్మృతిని అనగా హిందూమత కోడ్‌ను ఇతర మతాలవారిపై, తెగలపై విధించనున్నారు (గిరిజనుల ఓట్లు కావాలి కావున యుసిసి నుండి వారిని మినహాయిస్తారట!). ముస్లింల ఓట్లు ఎలాగూ బీజేపీకి రావు కాబట్టి వారిపై విధిస్తారన్నమాట!! సిక్కులు, పార్శీలు, బౌద్ధులు వగైరాలను ఏమి చూస్తారో వేచి చూడాలి) ప్రయోజనం పొందడానికి పూనుకున్నారు. 1977లో ఎ.బి.వాజ్‌పేయ్‌కి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేసే అవకాశం లభించినప్పుడు మెజారిటీని సమీకరించుకునేందుకు లౌకిక ప్రతిపక్షపార్టీల తోడ్పాటును అర్థించగా, దాని హిందుత్వ ఎజెండా కారణంగా ఏ పార్టీ ముందుకు రాలేదు.

ఆ తదుపరి ఎన్నికల్లో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటు నిమిత్తం, తమ ఎజెండాలోని పైన ప్రస్తావించిన మూడు వివాదాస్పద అంశాలను ఎన్‌డీఏ పరిపాలన ఎజెండా నుండి వెనక్కు పెట్టడం తెలిసిందే. 2014 ఎన్నికల నాటికి రాజకీయ పరిస్థితుల్లో వచ్చిన మార్పులతో, దేశ అంతర్జాతీయ పరిణామాలు మితవాద ప్రభావంతో నరేంద్ర మోదీ కొత్త నాయకత్వ ముఖంతో బీజేపీ అధికారాన్ని జేజిక్కించుకుంది. అది సమాజంలో ఛాందసం పురి విప్పటానికి, విద్వేషపూరిత మత విభజనకు, పరిపాలనకు మధ్యేమార్గం నుండి పచ్చిమితవాదం వైపు మరల్చటానికీ పునాదులు వేసింది. ఇదే కాలంలో కాంగ్రెస్ పార్టీ మరీ బలహీనమైంది. బీజేపీ బలపడింది. విస్తరించింది. 2019 ఎన్నికల్లో లోకసభలో ఏకపక్ష మెజారిటీ లభించింది.

రామజన్మభూమి విస్తృతంగా ప్రచారంతో ఏర్పడిన ప్రదేశంలో రాముని ఆలయ నిర్మాణానికి సుప్రీంకోర్టు తీర్పు అంతకుముందే మార్గం సుగమంచేయగా, 2018 ఆగస్టు 5న మోదీ ప్రభుత్వ ఆర్టికల్ 370ని ఆకస్మికంగా పార్లమెంటు చట్టం ద్వారా రద్దు చేసింది. హిందూ రాజ్యస్థాపన లక్ష్యసాధన దిశలో ఇక మిగిలింది ఉమ్మడి పౌరస్మృతి. వచ్చే లోకసభ ఎన్నికల్లో గెలుపు భరోసాకు అది తురుపుముక్కగా పనిచేస్తుందని బీజేపీ భావిస్తుందని చెప్పవచ్చు. అయితే మత ఎజండాయే ఆకర్షణ కోల్పోతున్నదని కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు లోకానికి చాటాయి. దీన్ని గ్రహించని బీజేపీ సంస్థాగత మార్పులు, మిత్రపక్షాలను పెంచుకోవడం వగైరాలపై దృష్టిపెట్టటాన్ని మనం చూస్తున్నాం. అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో బీజేపీ నాయకత్వంలో మార్పులు, కొత్త ఇన్‌ఛార్జీల నియామకం, సభలు సమావేశాలు ఇందులో భాగమే.

బీజేపీ ఉత్తరాది రాష్ట్రాల పార్టీ అనే ముద్రను చెరుపుకోటానికి శాయశక్తులా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఉత్తరాదిలో ఏ రెండు, మూడు రాష్ట్రాల్లో ఫలితాలు తారుమారయినా బీజేపీ పడవ మునుగుతుంది. పెద్ద రాష్ట్రాల్లో ఒకటైన బిహార్‌లో బీజేపీ రాజకీయం తిరగబడింది. మధ్యప్రదేశ్ అధికారం బ్యాలెన్స్‌లో ఉంది. మరో పెద్దరాష్ట్రం, దేశ ఆర్థిక రాజధాని ముంబై రాజధానిగా ఉన్న మహారాష్ట్రలో చేజారిన అధికారం కైవశం చేసుకునేందుకు 2019 ఎన్నికలు ఫలితాలు మరుక్షణం నుంచీ బీజేఎ ప్రయత్నిస్తోంది. శివసేతో, ఎన్‌సీపీ అజిత్‌పవార్‌తో బేరసారాలు ఆదిలో ఫలించకపోయినా, కేంద్ర నాయకత్వం సహాయ సహకారాలతో ఫడ్నవిస్ ప్రభుత్వంలో గతేడాది శివసేనను చీల్చటంతో ఫలప్రదమైనాయి. అయితే పండుపక్వానికొచ్చి బీజేపీ చేతికే ముఖ్యమంత్రిత్వం అందుతుందో లేదో వేచిచూడాల్సిందే.

బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా గత వారంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో తమ పార్టీ అధ్యక్షులను మార్చారు. తెలంగాణలో ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబంపై, పరిపాలనపై ఒంటి కాలిమీదవస్తూ, గణ గర్జన చేస్తూ బీజేపీ అస్తిత్వాన్ని కొంతమేర విస్తరించిన బండి సంజయ్ (ఎంపి) ను తొలగించి, కడుపులో చల్ల కదలకుండా కేంద్ర మంత్రిగా హాయిగా ఉన్న గంగారపు కిషన్‌రెడ్డి నెత్తిన ముళ్ల కిరీటం పెట్టడం ఆ పార్టీలో కొంత అసంతృప్తికి దారితీసింది. చిత్రమేమంటే, రాష్ట్ర బీజేపీ నాయకుల్లో ఆదినుండీ ఆ పార్టీలో ఉన్నవారికన్నా కాంగ్రెస్, టీఆర్‌ఎస్ (ప్రస్తుతం బిఆర్‌ఎస్) నుండి వచ్చి చేరినవారు ఎక్కువమంది అయినారు. ఇది అంతర్గత ఆధిక్యపోరుకు హేతువవుతోంది. ఈటెల రాజేందర్ సహా కొత్త నాయకులు కొత్తపార్టీ పెట్టే ఆలోచన చేశారు. ప్రస్తుతానికి సర్దుకున్నాయి. అయితే కొత్తగా బీజేపీలోకి వచ్చేవారు ఆగిపోయారు. కాంగ్రెస్‌వైపు వెళుతున్నారు. కర్నాటక ఎన్నికల ఫలితాల తదుపరి రాష్ట్ర కాంగ్రెస్‌లో ఉత్సాహం పెరిగింది. ఎవరి గ్రూపు వారివే అయినా ఐకమత్యంగా ఎన్నికలు ఎదుర్కొనేందుకు సమాయత్తమవుతున్నారు. పాలక బిఆర్‌ఎస్‌కు ఇతర రాష్ట్రాలకు విస్తరించి దేశానికి ప్రత్యామ్నాయం ఇవ్వటమేమోగాని, కొద్దిగా మహారాష్ట్రలో తప్ప మరే రాష్ట్రంలో కాలుమోపే అవకాశం లభించలేదు.

రాష్ట్రం వరకు మూడవ పదవీకాలం కెసిఆర్‌కి వర్తిస్తుందనే ధీమా ఆ పార్టీ శ్రేణుల్లో ఉంది. మునుగోడు కొనసాగింపుగా వామపక్షాలతో సీట్ల సర్దుబాటును రాజకీయ పక్షాలు ఊహిస్తున్నా అవుతుందో, కాదో చెప్పగలవారులేదు. అయితే ఏది ఏమైనా, కలిసి పోటీ చేయాలని సీపీఐ, సీపీఐ(ఎం) నిర్ణయించడం ఆ దిశలో పనిచేయడం ఒక సానుకూల అంశం.

ఒక ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ నాయకత్వం సోము వీర్రాజు చేతి నుండి దగ్గుబాటి పురందేశ్వరికి మారింది. వీర్రాజు పట్ల అసంతృప్తులను బుజ్జగించటమే తక్షణ మోదీయం తప్ప రాజకీయ లబ్ధిని పార్టీ ఆశించలేదు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ముందస్తును త్రోసిపుచ్చినా లోకసభతోపాటు వచ్చే మే–జూన్‌లో ఎలాగూ తప్పవు. పాలక వైఎస్‌ఆర్‌సీపీ, పవన్‌కళ్యాణ్ ఆశిస్తున్నట్లు టీడీపీ, జనసేన,బీజేపీ కూటమిల్లో ఏ పక్షం గెలిచినా బీజేపీకి పోయేదేమీ లేదు. అన్ని పార్టీలు మోదీ జిందాబాద్ అంటున్నాయి. అందువల్ల బీజేపీ ఎవర్నీ దూరం చేసుకోదు.బీజేపీ అధ్యక్షుడు నడ్డా జీ హైదరాబాద్‌లో దక్షిణాదిరాష్ట్రాలు బీజేపీనాయకులు సమావేశంసందర్భంగా పార్టీకి ఉత్తరాదిలో తగ్గే సీట్లను దక్షిణాదిరాష్ట్రాలు పూడ్చాలనుకుని అత్యాశకుపోయారు. దక్షిణాదిలో బీజేపీ విస్తరణకు కర్నాటక ముఖద్వారం అని బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ ఆశపెట్టుకోగా కర్నాటకఓటర్లు ఆ గేటుమూసేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దెదించి దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలని కోరుకుంటున్న 17–18 ప్రతిపక్షపార్టీలు ఐక్యంగా పోటీచేసే విషయమై ఈ నెల 17,18 తేదీల్లో బెంగళూరులో చర్చలు కొనసాగించనున్నాయి. ఎన్‌సీపీని బీజేపీ చీల్చటంతో శరద్‌పవార్ పెద్దరికానికి అధారిటీకి ఎదురుదెబ్బ. ప్రతిపక్షాలను చీల్చడంలో బీజేపీ తదుపరి ఎజండా నిస్సందేహంగా బిహార్‌లో నితీష్‌కుమార్ బీజేపీతో పొత్తులు, ఎత్తులు జిత్తుల్లో మునిగి తేలినవాడు అయినందున అప్రమత్తంగా ఉండకపోదు.

సీనియరు జర్నలిస్టు

ప్రోత్సాహం లేని తృణధాన్యాలు

డా. ముచ్చుకోట సురేష్‌బాబు

ప్రపంచంలో డెబ్బై శాతం పైగా దేశాల మద్దతుతో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2023 సంవత్సరాన్ని 'అంతర్జాతీయ తృణ ధాన్యాల' సంవత్సరంగా ప్రకటించడానికి ప్రధానమంత్రి దార్శనికత చొరవ దారి తీసిందని జబ్బలు చరుచుకుంటున్నారు. తృణ ధాన్యలు మానవులు పండించే తొలి పంటలలో ఒకటి. పోషకాలు ముఖ్యమైన మూలం. భవిష్యత్తు కోసం వీటిని ఆహారంగా తీసుకోవాలి. ప్రజల ఆహారాలలో ఇంకా మార్పు లేదు. ఆహార వాతావరణ మార్పు ఆహార లభ్యత ఎలా ప్రభావితం చేస్తుందో తెలియకుంటే ప్రమాదకరం. తృణధాన్యాలు ప్రపంచ ఉద్యమం ఆహార భద్రత దిశలో ఒక ముఖ్యమైన ముందడుగు, చిరుధాన్యాలు సులభంగా పండుతాయి. వాతావరణాన్ని కరువును తట్టుకోగలవు. మిల్లెట్లు సమతుల్య పోషకాహారం మూలం, సహజ వ్యవసాయ విధానాలకు అనుగుణంగా తక్కువ నీరు అవసరమని శాస్త్రవేత్తలు చెబుతున్నా ప్రభుత్వం నుండి ప్రోత్సాహకం లేక రైతులు పాటించడం లేదు. తృణ ధాన్యాలు పండించడం రైతులకు, సమాజానికి వాతావరణానికి ఎంతో మేలు చేకూరుస్తుంది. వాస్తవానికి తృణ ధాన్యాల వినియోగం గత పదిసంవత్సరాలుగా దారుణంగా పడిపోయింది. ఒకప్పుడు దక్షిణాది రాష్ట్రాలు, ఒరిస్సా, చత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో రాగులు, కొర్రలు, సజ్జలు, జొన్నలు ఆహారంగా ఉండేది. పది సంవత్సరాల క్రిందట 8.6 లక్షల హెక్టార్లలో తృణ ధాన్యాలు పండించే వారు, ఇప్పుడు కేవలం 1.86 లక్షల హెక్టార్లకు పరిమితమయింది. రైతుల ప్రయోజక గ్రూపులు అలాగే రాష్ట్రాల మిల్లెట్ బోర్డులు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారు. దేశంలో రెండు విడతలుగా 25 కోట్ల భూసార నాణ్యతా కార్డులు ఇచ్చామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న రైతులకు ఎంతమేరకు ఉపయోగపడుతుందో తెలుస్తూనే ఉంది. గత నాలుగు సంవత్సరాలుగా ఒక్కటంటే ఒక్క భూసార పరీక్షా చేపట్టని రాష్ట్రాలు ఉన్నాయి. చాల రాష్ట్రాల్లో సేంద్రియ కర్బనం పూర్తిగా తగ్గింది. జాతీయ మట్టి సర్వే భూ వినియోగ ప్రణాళిక సంస్థ వారు స్థానిక సాగు భూములు తీరుతెన్నులు, వాతావరణ పరిస్థితులను బట్టి ఏయే పంటలు సాగు చేసుకుంటే ఫలితం బాగుంటుందని సూచనలు ఇస్తున్నారు. ఈ మధ్య వారు ప్రచురించిన నివేదికలో తెలుగు రాష్ట్రాల్లోని భూముల్లో సేంద్రియ కర్బనం అడుగంటిందని, ఇప్పటికైనా ప్రభుత్వం, రైతులు జాగ్రత్తపడి సేంద్రియ కర్బనాన్ని కనీసం 0.7 కైనా పెంచుకోక పోతే భూములు సాగుయోగ్యం కాకుండా పోతాయని హెచ్చరించారు.

భూమిని నమ్ముకోవడం అంటే, పంట భూములు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం చేస్తూ సేంద్రియ కర్బనాన్ని పెంపొందించుకోవడం. భూమి ఆరోగ్యానికి సేంద్రియ కర్బనం ఒక ముఖ్య సూచిక. మన భూముల్లో 0.5 % కన్నా సేంద్రియ కర్బనాన్ని పెంపొందించడం కష్టసాధ్యమని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే, రసాయనిక ఎరువులకు పూర్తిగా స్వస్తి పలికి ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు ఆచరిస్తున్న కొందరు రైతులు మాత్రం 2.0% వరకు పెంచుకోవడం సాధ్యమేనని నిరూపిస్తున్నారు. తక్కువ ఖర్చుతో, స్వల్పకాలంలోనే సేంద్రియ కర్బనాన్ని పెంచుకునే అనేక మార్గాలున్నాయని సూచిస్తున్నారు. పౌష్టికాహార లోపం గురించి నిరంతరం చెబుతున్న ఆహార శాస్త్రవేత్తల హెచ్చరికలను సలహాలను ప్రభుత్వం తుంగలో తొక్కింది, వ్యవసాయం ఏక పంటగా మారితే మన ఆరోగ్యం దెబ్బతింటుంది, ఆహార వైవిధ్యాన్ని పెంచడానికి తృణధాన్యాలు మంచి మార్గమని సూచించినా ప్రయోజనం లేదు. రైతులకు ప్రోత్సాహకాలు అలాగే మంచి విత్తనం కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విమఫలమయ్యింది. గ్రామాలల్లో పాడి తక్కువయ్యి జొన్న, సజ్జ, రాగి, కొర్ర పంట తక్కువయ్యింది. చిరుధాన్యాలు వినియోగదారునికి, సాగుదారునికి వాతావరణానికి మేలు చేస్తాయి. ప్రజలకు, వినియోగదారులకు సమతుల్యపోషణ గొప్ప మూలం. సాగుదారులకు భూమి సారవంత మవుతుంది అలాగే మన పర్యావరణానికి ప్రయోజనం చేకూరుస్తాయి. తృణ ధాన్యాలు, ముతక ధాన్యాలు వీటిని సాంప్రదాయకంగా 5000 సంవత్సరాలకు పైగా భారత ఉపఖండంలో పండిస్తారు. అవి అధిక పోషక విలువలను, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్‌లతో సమృద్ధిగా ఉంటాయి. ఇతర తృణధాన్యాల మాదిరిగా కాకుండా, తృణ ధాన్యాలకు తక్కువ నీరు, సారవంతమైన నేల అవసరం. తృణ ధాన్యాలను "పేదవారి ఆహార ధాన్యం" అని కూడా అంటారు.

ప్రపంచం ఇప్పుడు తృణ ధాన్యాలలో అపారమైన సామర్థ్యం గమనిస్తోంది. భారతదేశం 170 లక్షల టన్నుల కంటే ఎక్కువ ఉత్పత్తితో తృణ ధాన్యాలకు ప్రపంచ కేంద్రంగా మారడానికి ప్రణాళికలు రూపొందించాలి. ఆసియాలో ఉత్పత్తిలో అగ్రగామిగా నిలువడానికి కృషి చేయాలి. సింధు నాగరికతలో ఈ ధాన్యాలకు సంబంధించిన తొలి ఆధారాలు కనుగొన్నారు. అలాగే ఆహారం కోసం పెంచిన మొదటి మొక్కలలో ఇది ఒకటి. ఇది దాదాపు 131 దేశాలలో సాగవుతున్నాయి. ఆసియా, ఆఫ్రికాలో సుమారు 60 కోట్ల మందికి సాంప్రదాయ ఆహారం తృణధాన్యాలే. ఇంత గొప్ప మేలు కలిగిన చిరుధాన్యాల సాగు కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమయింది. దేశంలో రైతుకు సరైన విత్తనం ఇవ్వడం లేదు. రైతులకు విత్తనం అందుబాటులో లేక సుదూర ప్రాంతాల నుండి తెచ్చుకుంటున్నారు. రైతు భరోసా కేంద్రాలలో, రైతు వేదికలల్లో తృణధాన్యాలు దొరకడం లేదు. తృణ ధాన్యాల సంవత్సరం 2023 సురక్షితమైన, స్థిరమైన, ఆరోగ్యకరమైన భవిష్యత్తు దిశగా సామూహిక ఉద్యమాన్ని ప్రారంభించాలని పౌర సమాజం, అలాగే ప్రభుత్వం ఆకాంక్షించాలి. తృణ ధాన్యాల పంటల ఉత్పత్తి క్షీణించడం వల్ల తృణ ధాన్యాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సాగు చేసే రైతుకు ప్రోత్సాహం లేదు. రైతు ప్రయోజన గ్రూపులు ఏర్పాటు చేయాల్సిన వ్యవసాయ శాఖ అసలు పట్టించుకోవడం లేదు. తృణ ధాన్యాల నిర్వహణ మార్కెట్ సంధానం నిలువ చేసుకోవడానికి గోదాములు, శీతల గిడ్డంగులు లేనే లేవు. ఉన్న అరకొర ప్రాసెసింగ్ యూనిట్లు, ప్యాకేజి యూనిట్లు వ్యాపారస్తుల చేతిలో ఉన్నాయి. సేంద్రియ వ్యవసాయం, సుస్థిర, ప్రాకృతిక వ్యవసాయం, సహకార వ్యవసాయం అనేది భ్రమ గా మిగిలింది. తరచుగా తృణ ధాన్యాల సాగును కలిగి ఉన్న సాంప్రదాయ వ్యవసాయ విధానాలు, వరి, గోధుమ, మొక్కజొన్న వంటి అధిక దిగుబడినిచ్చే పంటలకు ప్రాధాన్యతనిచ్చే ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా చిరుధాన్యాల సాగు పలుచనవుతుంది. మార్కెట్ డిమాండ్, సాగు సౌలభ్యం ప్రభుత్వ విధానాలతో సహా వివిధ కారణాల వల్ల ఈ పంటలు చతికిలపడ్డాయి. సమాజాలు ఆధునికీకరణ పట్టణీకరణ, ఆహార ప్రాధాన్యతలు వినియోగ విధానాలు మారుతాయి. అనేక ప్రాంతాలలో ఒకప్పుడు ప్రధానమైన ఆహారాలుగా ఉన్న చిరు ధాన్యాలను ప్రాసెస్ చేసిన ఆహారాలు, శుద్ధి చేసిన ధాన్యాలు, జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ భర్తీ చేశాయి. ఆహార ప్రాధాన్యతలలో ఈ మార్పు ఫలితంగా డిమాండ్ తగ్గి ఉత్పత్తిలో క్షీణతకు దారితీసింది. వరి, గోదుమ వంటి ప్రధాన తృణధాన్యాల పంటలతో పోలిస్తే, తృణ ధాన్యాల పరిశోధన, అభివృద్ధి సాంకేతిక పురోగమనాల పరంగా చాలా తక్కువ శ్రద్ధను పొందాయి. పెంపకం కార్యక్రమాలు, పంటల మెరుగుదల, తృణ ధాన్యాల కోసం వ్యవసాయ పద్ధతులపై పరిమిత పెట్టుబడి వాటి ఉత్పాదకత పోటీతత్వాన్ని అడ్డుకుంది. వినియోగదారుల ప్రాధాన్యతలకు అనుగుణంగా మెరుగైన రకాలను అభివృద్ధి చేయడానికి దారితీస్తుంది.

ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

రాహుల్‌కు వెల్లువెత్తిన సంఘీభావం

- దేశవ్యాప్తంగా కాంగ్రెస్ 'మౌన సత్యాగ్రహం'
- గాంధీజీ విగ్రహాల వద్ద నిరసనలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని లోక్‌సభకు అనర్హునిగా చేసేందుకు అధికార బీజేపీ కుయుక్తులకు పాల్పడటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో బుధవారం రాష్ట్రాల రాజధాని నగరాల్లో మహాత్మాగాంధీ విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమాలు జరిగాయి. కేరళ రాజధాని తిరువనంతపురంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రాహుల్‌కు సంఘీభం తెలుపుతూ 'మౌన్ సత్యాగ్రహ్' (నిశ్శబ్ద నిరసన) పాటించారు. గాంధీపార్కు వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం ముందు జరిగిన మౌన నిరసనలో కేరళ పీసీసీ చీఫ్ కే సుధాకరన్, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్, ఎంపీలు కొడికున్నిల్ సురేశ్, రాజ్‌మోహన్ ఉన్నితన్, కే మురళీధరన్, వివిధ జిల్లా కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సత్యాగ్రహం ప్రారంభానికి ముందు కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా అయిన సురేశ్ మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, అధికార బీజేపీ రాహుల్ గాంధీని పార్లమెంటుకు దూరంగా ఉంచడానికి ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. ఇలాంటి చర్యలన్నింటికీ అడ్డుకట్ట వేసేందుకు దేశంలోని కాంగ్రెస్ కార్యకర్తలు ఐక్యంగా ఆయనకు అండగా నిలుస్తారని స్పష్టం చేశారు. నిరసనలో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. ఎంపీగా అనర్హత వేటు వేయకముందు రాహుల్‌గాంధీ కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు.

- పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి కోల్‌కతాలోని మాయో రోడ్-డఫెరిన్ రోడ్ క్రాసింగ్ వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మౌన సత్యాగ్రహం చేపట్టారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
- కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి శివకుమార్ తదితరులు బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్ వద్ద మౌన సత్యాగ్రహం చేపట్టారు. రాహుల్ గాంధీ ఫోటోతో పాటు 'నిజం గర్జించాలి' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. సాయంత్రం వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో సిద్ధరామయ్య, శివకుమార్‌తో పాటు అనేకమంత్రి రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, కాంగ్రెస్ అగ్రనేతలు పాల్గొన్నారు. వాక్ స్వాతంత్ర్యం ప్రమాదంలో పడిందని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే గొంతు నొక్కేస్తారని ప్రతీకాత్మకంగా తెలియజేసేందుకు నిరసనకారులు నోటికి నల్ల రిబ్బన్ కట్టుకున్నారు.
- రాహుల్ గాంధీకి సంఘీభావంగా కాంగ్రెస్ జార్ఖండ్ శాఖ మౌన సత్యాగ్రహం చేపట్టింది. ముఖాలకు నల్లని ముసుగులు ధరించి, జార్ఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ ఠాకూర్, పార్టీ సహచరులతో కలిసి రాంచీలోని మొరాబాదీ మైదానంలో బాపు వాటిక వద్ద మౌన నిరసనకు దిగారు.

అంతకుముందు ఠాకూర్ విలేకరులతో మాట్లాడుతూ... దేశంలో అవినీతి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణంపై గళం విప్పిన రాహుల్‌జీ గొంతును మూయించేందుకు మోదీ ప్రభుత్వం దుష్ట ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'మౌన సత్యాగ్రహం' రాహుల్ గాంధీ గొంతుకకు బలం చేకూరుస్తుందని తెలిపారు.

- జమ్మూలో జరిగిన మౌన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జమ్మూలోని సత్వారీ చౌక్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం ముందు జరిగిన నిరసనకు జమ్ముకశ్మీర్ కాంగ్రెస్ అధ్యక్షుడు వికార్ రసూల్ వానీ, వర్కింగ్ ప్రెసిడెంట్ రామన్ భల్లా నాయకత్వం వహించారు. 'మేము మా నాయకుడు రాహుల్ గాంధీకి పూర్తి మద్దతుగా ఇక్కడ ఉన్నాము. గాంధీపై బీజేపీ ప్రతీకార రాజకీయాలకు వ్యతిరేకంగా మౌన నిరసన చేపట్టాం. వారు అతనిపై కుట్రకు పాల్పడ్డారు' అని పార్టీ అధికార ప్రతినిధి రవీందర్ శర్మ అన్నారు. రాహుల్ గాంధీ నిర్భయంగా సామాన్యులు, పేదలు, యువకులు, మహిళలు, పన్ను చెల్లింపుదారుల సొమ్మును దోచుకుంటున్న వారికి వ్యతిరేకంగా గళం విప్పారన్నారు. రాహుల్ గొంతును అణిచివేసేందుకు మోదీ ప్రభుత్వం ఎన్నో కుయుక్తులకు పాల్పడిందని, దర్యాప్తు సంస్థల్ని దుర్వినియోగం చేసిందని ఏఐసీసీ జమ్ముకశ్మీర్ ఇన్‌చార్జి మనోజ్ యాదవ్ అన్నారు. అయితే ఇది రాహుల్ గాంధీ గొంతు మాత్రమే కాదు, 130 కోట్ల మంది భారతీయుల గొంతు అని చెప్పారు.

ఢిల్లీ సహా నాలుగు రాష్ట్రాల్లో 16న మౌన సత్యాగ్రహం

భారీ వర్షాల కారణంగా ఢిల్లీ, హరియాణా, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో మౌన సత్యాగ్రహాన్ని వాయిదా వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. అయితే ఆ నాలుగు రాష్ట్రాల్లో ఈ నెల 16న మౌన సత్యాగ్రహం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మరో నాలుగు వందే భారత్ రైళ్లు

న్యూఢిల్లీ: దేశంలో వందే భారత్ రైళ్ల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 25 రైళ్లను అందుబాటులోకి తెచ్చిన రైల్వే శాఖ...మరో 4 రైళ్లు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. జులై నెలాఖరులోనే వీటిని ప్రారంభించాలని భావిస్తోంది. ఈ నాలుగు రైళ్లూ ఎనిమిదేసి కోచ్‌లతో నడవనున్నాయి. ఇందులో ఏడు చైర్ కార్లు, ఒక ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్ ఉండనున్నాయి. ఈ నెలలో ప్రారంభించనున్న రూట్లలో ఢిల్లీ- చండీగఢ్, చెన్నై- తిరునల్వేలి, లక్నో- ప్రయాగ్‌రాజ్, గ్వాలియర్- భోపాల్ ఉండనున్నాయి. ఎనిమిదేసి కోచ్‌లు అంటే 556 మంది ప్రయాణించడానికి వీలుంటుంది. ప్రస్తుతం 25 రైళ్లు నడుస్తుండగా...అందులో తొమ్మిది రైళ్లు ఎనిమిది కోచ్‌లతోనే నడుస్తున్నాయి. కొత్త రైళ్లు కలిపితే మొత్తం వందే భారత్ రైళ్ల సంఖ్య 29కి చేరనుంది. ఢిల్లీ- చండీగఢ్ రూట్‌లో ఇప్పటికే శతాబ్ది సహా అనేక రైళ్లు నడుస్తున్నాయి. అయినప్పటికీ ఈ రూట్‌లో ప్రయాణికుల నుంచి విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో వందే భారత్ రైలును తీసుకురావాలని రైల్వే శాఖ నిర్ణయించింది. లక్నో- ప్రయాగ్‌రాజ్ వందేభారత్ రూట్‌లో కొత్త రైలు తేవడం ద్వారా యూపీలో ఈ రైళ్ల సంఖ్య మూడుకు చేరనుంది. త్వరలో ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్‌లో గ్వాలియర్- భోపాల్ మధ్య వందే భారత్ రైలును తీసుకురావాలని రైల్వే శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. కాగా, తెలుగు రాష్ట్రాలకు మరో వందే భారత్ రైలు అందుబాటులోకి వస్తుందని కొన్ని రోజుల క్రితం ప్రచారం జరిగింది. చెన్నై- తిరుపతి లేదా చెన్నై- విజయవాడ మధ్య ఈ రైలు ఉంటుందని వార్తలొచ్చాయి. అయితే, ప్రస్తుతానికి దక్షిణాదిలో చెన్నై- తిరునల్వేలి మధ్య ఈ నెలలోనే వందే భారత్‌ను తీసుకురావాలని రైల్వే శాఖ నిర్ణయించింది.

త్వరలో హీరో విజయ్ పాదయాత్ర?

చెన్నై: తమిళ స్టార్ హీరో విజయ్ రాజకీయ రంగ ప్రవేశంపై మరోసారి వార్తలు గుప్పుమన్నాయి. ఆయన త్వరలో పాదయాత్రకు సన్నద్ధమవుతోన్నట్లు తెలుస్తోంది. సినీ రంగంతో పాటు రాజకీయ రంగంలోనూ ఈ వార్త సంచలనం సృష్టిస్తోంది. కొన్ని రోజులుగా విజయ్ రాజకీయ ప్రవేశం గురించి వార్తలు వస్తున్నాయి. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేయాలని విజయ్ నిర్ణయించుకున్నట్లు జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. 'విజయ్ మక్కల్ ఇయక్కం' అభిమాన సంఘం సభ్యులతో విజయ్ తరచూ భేటీ అవుతున్నారు. మంగళవారం కూడా అభిమానులతో విజయ్ సమావేశమై...పాదయాత్రపై నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయన నటించిన తాజా చిత్రం 'లియో' విడుదల కంటే ముందే తమిళనాడు వ్యాప్తంగా పాదయాత్ర చేయాలనుకుంటున్నారని ఆయన అభిమానులు చెబుతున్నారు. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. తమిళనాడులోని నియోజకవర్గాల వారీగా టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను విజయ్ ఇటీవల సన్మానించారు. చెన్నై వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సాహం అందించి అభినందించారు. ఇవన్నీ చూస్తుంటే విజయ్ రాజకీయ రంగ ప్రవేశం ఖాయమనే సంకేతాలు వస్తున్నాయి.

కొత్త ఇంటికి రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కొత్త ఇంటికి మారబోతున్నారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ నివసించిన ఇంట్లోకి రాహుల్ మారబోతున్నట్లు తెలుస్తోంది. మూడు పడక గదులతో కూడిన ఈ ఇల్లు దక్షిణ ఢిల్లీలోని నిజాముద్దీన్ తూర్పు ప్రాంతంలో ఉంది. రాహుల్ లోక్‌సభ సభ్యత్వం కోల్పోయిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారిక బంగళాను ఖాళీ చేసిన సంగతి తెలిసిందే. 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్నాటకలో జరిగిన ఓ సభలో రాహుల్ మాట్లాడుతూ 'దొంగల ఇంటిపేరు మోదీ ఎలా అవుతోంది?' అని ప్రశ్నించారు. దీనిపై గుజరాత్‌కు చెందిన పూర్ణేశ్ మోదీ పరువు నష్టం కేసు దాఖలు చేశారు. ఆయన దోషి అని సూరత్ కోర్టు తీర్పు చెప్పింది. ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. కేరళలోని వయనాడ్ నుంచి ఎంపీగా గెలిచిన రాహుల్... ఈ తీర్పుతో తన లోక్‌సభ సభ్యత్వం కోల్పోయారు. అనంతరం ఆయన 20 ఏళ్ల నుంచి నివసిస్తున్న అధికారిక బంగళాను ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. ఆ బంగళాను ఏప్రిల్ 22న ఖాళీ చేసి, తన తల్లి సోనియాగాంధీ నివాసంలో ఉంటున్నారు. తమ ఇల్లు ఇస్తామని వందలాది మంది కాంగ్రెస్ నేతలు చెప్పినప్పటికీ, తగిన ఇంటి కోసం రాహుల్ గాంధీ అన్వేషిస్తున్నారు. షీలా దీక్షిత్ కుటుంబ సభ్యులు సమీపంలోని వేరొక ఫ్లాట్‌లోకి మారాలని యోచిస్తున్నట్లు తెలియడంతో ఇ ఇంట్లో ఉండాలని రాహుల్ కోరుకున్నారు. సువిశాలమైన బంగళాలో నివసించిన రాహుల్ గాంధీ ప్రస్తుతం కేవలం 1,500 చదరపు అడుగుల వైశాల్యం గల ఇంట్లో ఉండాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. షీలా దీక్షిత్ ఈ ఇంటిని 1991లో కొన్నారు. ఆమె 1998 నుంచి 2013 వరకు ఢిల్లీ ముఖ్యమంత్రిగా సేవలందించారు. 2014లో కేరళ గవర్నర్‌గా కొద్దికాలం పని చేశారు. ఎన్డీయే ప్రభుత్వం రావడంతో గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. 2019 జులైలో మరణించే వరకు ఆమె ఈ ఇంట్లోనే నివసించారు

మోదీ జీ... మీ కర్తవ్యం నిర్వహించండి: ఖడ్గే

న్యూఢిల్లీ: ప్రజలకు నిత్యావసరమైన మసాలా దినుసుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీపై బుధవారం ఆయన వ్యంగ్య బాణాలు సంధించారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు ప్రధాని ప్రకటనలు అవసరం లేదని, ఆయన తన కర్తవ్యాన్ని సవ్యంగా నెరవేర్చాలని అన్నారు. ఈ ఏడాది జనవరిలో మసాలా దినుసుల ధరలను జులైలో ఉన్న ధరలతో పోల్చి చూపే చార్ట్‌ను ఖడ్గే ట్విట్టర్‌లో షేర్ చేస్తూ... "అచ్చే దిన్, అమృత్ కాల్, కర్తవ్య కాల్... కొన్ని రోజులకొకసారి కేవలం మార్కెటింగ్ కోసం కథనం పేరు మార్చబడుతుంది. పని ఎప్పుడూ మారదు!" అన్నారు. విపరీతంగా ధరలు పెంచి ప్రజల పొదుపు సొమ్మును దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. 'నరేంద్రమోదీ జీ... పెరిగిన ధరలతో అల్లాడుతున్న ప్రజలకు మీ ప్రకటనలు అవసరం లేదు, కానీ మీరు మీ కర్తవ్యాలను నెరవేర్చాల్సిన అవసరం ఉంది' అని ఖడ్గే హితవు పలికారు. కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై కాంగ్రెస్ పార్టీ కేంద్రాన్నితప్పు బట్టింది. సమస్యను పరిష్కరించడానికి ఆయన ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

ఆ బాధ వర్ణనాతీతం: అలహాబాద్ హైకోర్టు

అలహాబాద్: లైంగిక దాడికి గురైన బాధితురాలు గర్భవతి అయినపుడు బిడ్డకు జన్మనివ్వాలని ఆమెను నిర్బంధించడం సరికాదని, అలా చేస్తే వర్ణించడానికి వీలులేని బాధకు దారి తీస్తుందని అలహాబాద్ హైకోర్టు స్పష్టంచేసింది. పన్నెండేళ్ల వయసుగల మూగ, చెవిటి దివ్యాంగురాలు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈ తీర్పునిచ్చింది. 25 వారాల గర్భాన్ని తొలగించేందుకు అనుమతించాలని పిటిషనర్ కోరారు. బాధితురాలి పరిస్థితిని పరీక్షించేందుకు ఐదుగురు సభ్యులతో మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని హైకోర్టు గతవారం ఆదేశించింది. బాధితురాలి తరపు న్యాయవాది వాదిస్తూ ...పొరుగింట్లో ఉన్న వ్యక్తి బాధితురాలిపై అనేకసార్లు అత్యాచారం చేసినట్లు తెలిపారు. మాటలు రానందువల్ల ఆమె ఆ దారుణాల గురించి ఎవరికీ చెప్పలేకపోయినట్లు తెలిపారు. ఆమె తల్లి గట్టిగా ప్రశ్నించినపుడు, తన పొరుగింటి వ్యక్తి తనపై లైంగిక దాడి చేసినట్లు సంకేత భాష ద్వారా చెప్పినట్లు వివరించారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. లైంగిక నేరాల నుంచి బాలల పరిరక్షణ చట్టం ప్రకారం నిందితునిపై కేసు నమోదు చేశారు. బాధితురాలిని జూన్ 16న పరీక్షించినపుడు ఆమె 23 వారాల గర్భవతిగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని మెడికల్ బోర్డుకు నివేదించారు. గర్భందాల్చి 24 వారాలు పూర్తవుతున్నందువల్ల గర్భస్రావం చేయడానికి కోర్టు అనుమతి అవసరమని బోర్డు చెప్పింది. సంబంధిత పార్టీల వాదనలను విన్న హైకోర్టు స్పందిస్తూ... రాజ్యాంగ కోర్టులకు అసాధారణ అధికారాలు ఉన్నాయని తెలిపింది. ఈ అధికారాలను సుప్రీంకోర్టు సైతం గుర్తించిందని, అనేకసార్లు వీటిని వినియోగించి 24 వారాల తర్వాత కూడా గర్భస్రావం చేయడానికి అనుమతి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని తెలిపింది. ఈ కేసులో అత్యవసర పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఐదుగురు సభ్యుల వైద్య బృందాన్ని ఏర్పాటు చేయాలని జవహర్‌లాల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను ఆదేశించాలని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌ను ఆదేశించింది.

జన విశ్వాస్ బిల్లుకు సవరణలు

కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో 42 చట్టాలలోని 183 నిబంధనలను సవరించడం ద్వారా చిన్న నేరాలను నేరరహితంగా పరిగణించే జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2023కి సవరణలను కేంద్రమంత్రివర్గం ఆమోదించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇది 19 మంత్రిత్వ శాఖలతో నిర్వహించే 42 చట్టాలలో 183 నిబంధనలను సవరించాలని ప్రతిపాదించింది. బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ బిల్లు చర్చకు వచ్చినట్లు ఆ వర్గాలు తెలిపాయి. జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లును గత ఏడాది డిసెంబరు 22న లోక్‌సభలో వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టారు. ఆ తర్వాత బిల్లును పార్లమెంటు సంయుక్త కమిటీకి పంపారు. కమిటీ శాసనసభ విభాగం, న్యాయ వ్యవహారాల శాఖతో పాటు మొత్తం 19 మంత్రిత్వ శాఖలు లేదా విభాగాలతో వివరణాత్మక చర్చలు జరిపింది. ఈ ఏడాది మార్చిలో తన నివేదికను ఆమోదించింది. అదే నెలలో రాజ్యసభ, లోక్‌సభ ముందు ఉంచింది. వ్యాపారం చేయడం, జీవించడాన్ని సులభతరం చేసే ఉద్దేశంతో జన విశ్వాస్ బిల్లు తరహాలో చిన్న చిన్న నేరాలను నేరరహితం చేసేలా కసరత్తు చేపట్టేలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ప్రోత్సహించాలని పార్లమెంటరీ ప్యానెల్ కేంద్రానికి సూచించింది. కోర్టు కేసుల బకాయిలను తగ్గించడంలో దోహదపడుతుందని, పునరాలోచనతో నిబంధనలను ప్రభుత్వం సవరించాలని పేర్కొంది. వ్యాజ్యం పెరగకుండా ఉండేందుకు వీలున్న చోట జైలు శిక్షను తొలగించడంతో పాటు జరిమానా విధించాలని కూడా కమిటీ సిఫార్సు చేసింది. చిన్న చిన్న నేరాలను నేరరహితం చేయాలని కోరడంతో పాటు నేరంపై ఆధారపడి, విశ్వాస ఆధారిత పాలనను బలపరిచే ద్రవ్య జరిమానాల హేతుబద్ధీకరణను కూడా బిల్లు భావిస్తుంది. సవరిస్తున్న చట్టాలలో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940, ప్రజా రుణ చట్టం-1944, ఫార్మసీ చట్టం-1948, సినిమాటోగ్రాఫ్ చట్టం-1952, కాపీరైట్ చట్టం-1957, పేటెంట్ల చట్టం-1970, పర్యావరణ (రక్షణ) చట్టం-1986, మోటారు వాహనాల చట్టం-1988 ఉన్నాయి. ఇతర చట్టాలలో ట్రేడ్ మార్క్స్ చట్టం-1999, రైల్వే చట్టం-1989, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం-2000, ప్రివెన్షన్ ఆఫ్ మనీ-లాండరింగ్ చట్టం-2002, ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006, లీగల్ మెట్రాలజీ చట్టం-2009, ఫ్యాక్టరింగ్ రెగ్యులేషన్ చట్టం-2011 ఉన్నాయి. ఈ 42 చట్టాలు ఆర్థిక, ఆహార ఉత్పత్తి, పంపిణీ, ఆర్థిక సేవలు, వ్యవసాయం, వాణిజ్యం, పర్యావరణం, రోడ్డు రవాణా, రహదారులు, పోస్టులు, ఎలక్ట్రానిక్స్, ఐటీ సహా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలచే నిర్వహించబడతాయి.

15న అరబ్‌కు మోదీ

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పారిస్ పర్యటన ముగించుకుని జులై 15న అబుదాబిలో పర్యటించనున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధ్యక్షుడు, అబుదాబి పాలకుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో మోదీ చర్చలు జరుపుతారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) తెలిపింది. 'భారత్-యుఏఈ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం క్రమంగా బలపడుతోంది. ఇంధనం, విద్య, ఆరోగ్య సంరక్షణ, ఆహార భద్రత, ఫిన్‌టెక్, రక్షణ, సంస్కృతి వంటి వివిధ రంగాలలో దీనిని ముందుకు తీసుకెళ్లడానికి మార్గాలను గుర్తించడానికి ప్రధాన మంత్రి పర్యటన ఒక అవకాశంగా ఉంటుంది' అని పేర్కొంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఆహ్వానం మేరకు ప్రధాని జులై 13, 14 తేదీల్లో ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్నారు. పారిస్‌లో జులై 14న జరిగే బాస్టిల్ డే పరేడ్‌లో మోదీ గౌరవ అతిథిగా పాల్గొననున్నారు. ఇక్కడ ట్రై-సర్వీసెస్ భారత సాయుధ దళాల బృందం పాల్గొంటుంది. ప్రధాన మంత్రి గౌరవార్థం ప్రెసిడెంట్ మాక్రాన్ రాష్ట్ర విందుతో పాటు ప్రైవేట్ విందును కూడా ఏర్పాటు చేస్తారని ఎంఈఏ తెలిపింది. ఇద్దరు నేతలు విస్తృత స్థాయి చర్చలు కూడా జరపనున్నారు. 'ప్రధాన మంత్రి ఫ్రాన్స్ ప్రధానితో పాటు సెనేట్, ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీ అధ్యక్షులను కూడా కలవనున్నారు' అని పేర్కొంది. ఫ్రాన్స్‌లోని భారతీయ ప్రవాసులు, భారత, ఫ్రెంచ్ కంపెనీల సీఈవోలు, ప్రముఖ ఫ్రెంచ్ వ్యక్తులతో ఆయన విడివిడిగా సంభాషిస్తారు.

విమానం అత్యవసర ల్యాండింగ్

బెంగళూరు: బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెట్ విమానాశ్రయం నుంచి బయలుదేరిన ఒక ప్రైవేటు విమానంలో బుధవారం సాంకేతిక లోపం తలెత్తడంలో క్షణాల్లో వెనక్కి మళ్లింది. రన్‌వే మీద ల్యాండింగ్ సమయంలో విమానం అదుపు తప్పడం, రన్‌వైపే నిలిచిన నీటిలోనే ముందుకు వెళ్లి నోస్ ల్యాండింగ్ గేర్ సరిగా లేకపోవడంతో ముందుకు దొర్లింది. విమానం సురక్షితంగా ల్యాండ్ కావడంతో అందులోని ఇద్దరు పైలట్లకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఒళ్లు గగుర్పొడిచే విధంగా కనిపించే ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ప్రీమియర్ 1ఏ విమానం 'హాల్' నుంచి కెంపెగౌడ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉదయం బయలుదేరింది. కొద్ది సేపటికే విమానంలో సాంకేతిక సమస్య ఎదురైంది. విమానం ముందు వైపునున్న నోస్ ల్యాండింగ్ గేర్ రిట్రాక్ట్ అవడంతో ఆ సమాచారం హాల్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు తెలియజేసిన పైలట్ తక్షణం విమానాన్ని వెనక్కి మళ్లించారు. రన్‌వేను తాకిన విమానం అక్కడ నీరు ఉండటంతో నీటిలోంచే ముందుకు దూసుకు వెళ్లింది. నోస్ ల్యాండింగ్ గేర్ సమస్య కారణంగా విమానం పక్కకు ఒరుగుతూ సురక్షితంగా ల్యాండ్ అయింది.

బెంగాల్‌లో తృణమూల్ ముందంజ

35 వేల పంచాయతీలు హస్తగతం

రాష్ట్రంలో కొనసాగుతున్న రాజకీయ ఘర్షణలు

మరో ముగ్గురి మృతి... అనేక మందికి గాయాలు

కోల్‌కతా: హింసాత్మకమైన పశ్చిమ బెంగాల్ స్థానిక ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) బుధవారం భారీ విజయాన్ని నమోదు చేసింది. బుధవారం సాయంత్రం 4 గంటల నాటికి ఈసీ వివరాల ప్రకారం, అధికార టీఎంసీ 613 స్థానాల్లో ఆధిక్యతతో పాటు 34,901 గ్రామ పంచాయతీ స్థానాలను గెలుచుకుంది. దాని సమీప ప్రత్యర్థి బీజేపీ 9,719 స్థానాల్లో విజయం సాధించి 151 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మొత్తం 63,229 గ్రామ పంచాయతీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. సీపీఎం 2,938 స్థానాల్లో విజయం సాధించి 67 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. కాంగ్రెస్ 2,542 స్థానాల్లో విజయం సాధించి 66 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. కౌంటింగ్ చాలావరకు ప్రశాంతంగా ఉన్నప్పటికీ, భాన్‌గర్‌లో బాంబులు విసరడం వంటి విచ్చలవిడి సంఘటనలతో ఆందోళనకర వాతావరణం నెలకొంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని భాన్‌గర్‌లో మంగళవారం రాత్రి ఓట్ల లెక్కింపు కేంద్రం వెలుపల జరిగిన ఘర్షణలో ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్‌ఎఫ్) కు చెందిన ఇద్దరు కార్యకర్తలతో సహా ముగ్గురు మరణించారు. అనేక మంది గాయపడ్డారని పోలీసులు బుధవారం తెలిపారు. మాల్డా జిల్లాలోని రాంపూర్ గ్రామంలో టీఎంసీ కార్యకర్తల దాడిలో 24 ఏళ్ల కాంగ్రెస్ కార్యకర్త ఒకరు మరణించగా, అనేక మంది గాయపడినట్లు వివరించారు. ఈ ప్రాంత పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించడంతో టీఎంసీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యకర్త ఇంటి ముందు బాణసంచా కాల్చడం ఘర్షణకు దారితీసిందని పేర్కొన్నారు. కాగా, అధికార టీఎంసీ 6,430 పంచాయతీ సమితి స్థానాలను గెలుచుకోగా, 193 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. బీజేపీ 982 గెలిచి 53 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, సీపీఎం 176 స్థానాల్లో గెలిచి 14 చోట్ల ఆధిక్యంలో ఉంది, కాంగ్రెస్ 266 స్థానాల్లో గెలిచి 6 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. 9,728 పంచాయతీ సమితి స్థానాలకు ఎన్నికలు జరిగాయి. టీఎంసీ ఇప్పటివరకు ప్రకటించిన మొత్తం 674 జిల్లా పరిషత్ ఫలితాల్లో కూడా విజయం సాధించింది. 149 ఇతర స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. బీజేపీ 21 స్థానాల్లో విజయం సాధించి 5 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. సీపీఎం 2 స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ 6 చోట్ల గెలిచి 5 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మొత్తం 928 జిల్లా పరిషత్ సీట్లు ఉన్నాయి. ప్రచారంలో గాయపడిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం రాత్రి తనపై నమ్మకం ఉంచినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. 'గ్రామీణ బెంగాల్‌లో టీఎంసీ పట్ల ప్రజలు చూపుతున్న ప్రేమ, ఆప్యాయత, మద్దతుకు నేను ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను. రాష్ట్ర ప్రజల హృదయంలో టీఎంసీ మాత్రమే ఉందని ఈ ఎన్నికలు రుజువు చేశాయి' అని సామాజిక మాధ్యమ పోస్టులో బెనర్జీ పేర్కొన్నారు. 2024లో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ఈ ప్రాంతం నుంచి గాలి ఎటువైపు వీస్తుందో అన్ని పార్టీలు ఈ ఎన్నికలను సూచికగా చూస్తున్నాయి. శనివారం జరిగిన పంచాయతీ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న హింసాకాండలో కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోగా, వారిలో 11 మంది అధికార టీఎంసీకి చెందినవారు. గత నెలలో ఎన్నికలు ప్రకటించినప్పటి నుంచి ఎన్నికల సంబంధిత సంఘటనలలో మరణించిన వారి సంఖ్య 33 కాగా, అధికార పార్టీ మరణాలలో 60 శాతం చవిచూసింది. కలకత్తా హైకోర్టు జోక్యంతో ఎన్నికల, కౌంటింగ్ రోజులలో కేంద్ర పోలీసు బలగాలను మోహరించారు. 2003 పంచాయితీ ఎన్నికలలో ఒకే రోజు పోలింగ్‌లో 40 మంది మరణించిన హింసాత్మక గ్రామీణ ఎన్నికల చరిత్ర బెంగాల్‌కు ఉంది, అయితే ఈ సంవత్సరం హింసాత్మక పరిస్థితిని మీడియా విస్తృతంగా ప్రసారం చేయడంతో జాతీయ దృష్టిని కేంద్రీకరించింది. హింసాకాండపై నివేదిక ఇవ్వడానికి ఢిల్లీకి చేరుకున్న గవర్నర్ సి.వి.ఆనంద బోస్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 'ఒకరి బలాన్ని పరీక్షించుకోవడానికి ఎన్నికలు కారణాలు కాదని రాజకీయ పార్టీలు గ్రహించాలి' అని అన్నారు. 'ఇప్పుడు ప్రజల తీర్పు తర్వాత, గవర్నర్ బోస్ రాజీనామా చేసి బెంగాల్ నుంచి బయటకు రావాలి. ఆయన బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరించాడు. అనైతిక మార్గాల్లో వ్యతిరేకతను రెచ్చగొట్టాడు. బెంగాల్‌ను అవమానించాడు. ఆయనకు గవర్నర్‌గా కొనసాగే హక్కు లేదు' అని టీఎంసీ నాయకుడు కునాల్ ఘోష్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నికలు ఒక ప్రహసనంగా మారాయని అన్నారు. 'మేము భయపడినట్లుగానే, హింస, అధికార పార్టీ, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘం మధ్య అనుబంధం, అపూర్వమైన హింసాకాండ 40 మందికి పైగా మరణానికి దారితీసింది. కౌంటింగ్ తర్వాత, ఎన్నికల అనంతర హింసకు దారి తీస్తుంది' అని చెప్పారు. 'టీఎంసీ ప్రభుత్వ హయాంలో పశ్చిమ బెంగాల్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో 60 మందికి పైగా మరణించారు. 100 మంది గాయపడ్డారు. తీవ్రంగా ఖండిస్తున్నాము. బెంగాల్, భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజా ప్రతిఘటనను బలోపేతం చేయండి' అని సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరి ట్వీట్ చేశారు. నిజనిర్ధారణ బృందానికి నేతృత్వం వహిస్తున్న బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ బుధవారం ఇక్కడకు వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ 'గ్రామీణ ఎన్నికల సమయంలో హింస, హత్యలు ఆమోదయోగ్యం కాదు. చాలా మంది ప్రజలు హత్యకు గురయ్యారు. ఈ ఎన్నికల్లో ఇంత మంది ఎందుకు చనిపోవాల్సి వచ్చింది? ఉత్తర, దక్షిణ బెంగాల్‌లోని హింసాత్మక ప్రాంతాలను మేము సందర్శిస్తాము. తర్వాత, నివేదికను మా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు అందజేస్తాము' అని తెలిపారు.

మిస్సింగ్ ఆగేనా?

- అదృశ్యం కేసుల కలవరం
- బాలికలు, మహిళలకు భద్రత ఏదీ?
- పెరుగుతున్న సంఘటనలు
- స్పష్టం చేస్తున్న ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : బాలికలు, మహిళల అదృశ్య సంఘటనల కేసులు ప్రతి ఏటా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. బాలికల జననాల సంఖ్య క్రమేపీ పెరుగుతుందంటూ ప్రభుత్వాలు సంబరపడుతున్నప్పటికీ, వాటికి తోడుగా మిస్సింగ్ కేసులు అధికంగా నమోదవడం ప్రభుత్వాల పనితీరుకు అద్దం పడుతోంది. దేశ వ్యాప్తంగా బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులు అధికమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గత టీడీపీ ప్రభుత్వం నుంచి ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం వరకు గణాంకాలు పరిశీలిస్తే, బాలికలు, మహిళల మిస్సింగ్‌ల కేసులు పెరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల నుంచి గిరిజన తండాలు, దళిత కాలనీల్లో బాలికలు, మహిళలు కనిపించకుండా అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైపోతున్న సంఘటనలున్నాయి. నాలుగు నెలల క్రితం సికింద్రాబాద్ తిరుమలగిరిలో ముగ్గురు బాలికలు అదృశ్యమయ్యారు. బాలికలు, మహిళల భద్రత కోసం ప్రభుత్వాలు పటిష్టమైన నిర్ణయాలు తీసుకురాకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఈ మిస్సింగ్ కేసులు భవిష్యత్ తరాలకు ఆందోళన కలిగిస్తోంది. దీనికి తోడు నిత్యం మహిళలకు భద్రత కరవైంది. ఇటీవల కాలం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిశ పోలీసులకు ఈ కేసులు పెద్ద ఎత్తున ప్రత్యక్షమవ్వడం ఉదాహరణగా నిలుస్తోంది. దిశ చట్టాన్ని ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసినప్పటికీ, దానికి చట్టబద్ధతలో విఫలమైంది. కేంద్రానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ, ఇప్పటివరకు దానిపై పురోగతి లేదు. 18 ఏళ్లలోపు బాలికలు, 18 ఏళ్లు దాటిన మహిళలపై వివిధ రూపాల్లో వివక్ష, దాడులు, కిడ్నాప్‌లు, హత్యల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వాటిని కట్టడి చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందనే విమర్శలున్నాయి. మహిళా దినోత్సవానికి ముందే మహిళా సంక్షేమం, వారి భద్రత అంశాలు ప్రభుత్వాలకు, రాజకీయ పార్టీలకు గుర్తుకొస్తుంటాయి. మహిళలను ఉద్ధరించినట్లు వ్యవహరిస్తుంటాయి. మహిళలపై ఒక ఘోర సంఘటన జరిగినప్పుడు వాటిపై ఐక్య ఉద్యమాలు చేపట్టడంలో విఫలమవుతున్నాయి. దీంతో ఈ కేసులు నీరుగారిపోవడం, కొంత కాలానికి అవి మనుగడలో లేకుండాపోతున్నాయి. ఇవి పాలకులకు అనుకూలంగా మారుతున్నాయి. దిశ చట్టం మార్గదర్శకాలను రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్నప్పటికీ బాలికలు మహిళల మిస్సింగ్ సంఖ్య క్రమేపీ పెరగడం గమనార్హం. దిశ విభాగం సిబ్బందికి ఇటీవల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులు పెద్ద ఎత్తున వస్తున్నాయి.

మిస్సింగ్ కేసులకు కారణాలివీ...: మిస్సింగ్ కేసులకు ప్రధాన కారణాలిలా ఉన్నాయి. ప్రేమించడం, పరీక్షల్లో తప్పడం, మానసిక రుగ్మతలు, ఇంట్లో ఘర్షణలున్నాయి. వాటన్నిటినీ పోలీసులు అదృశ్యం కేసులుగా నమోదు చేస్తారు. అయితే మహిళల భద్రత కోసం ముందస్తుగా కేసులు కట్టకుండా, వారిని కనుగొనేందుకు ప్రయత్నిస్తారు. లేకుంటే వారి ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉంది. ఉపాధి పేరుతో మహిళలను మోసగించి ఇతర దేశాలకు పంపించడం, డబ్బును ఆశగా చూపించి వ్యభిచార వృత్తిలోకి దింపడాన్ని హ్యూమన్ ట్రాఫిక్ కేసులుగా పరిగణిస్తారు. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం అలాంటి కేసులు రాష్ట్రంలో లేవని పోలీసు యంత్రాంగం చెబుతోంది. అదృశ్యం, అక్రమ రవాణా అనే కేసులు వేర్వేరు అని, ఆ రెండింటినీ ఒకటిగా పోల్చిచూడవద్దంటూ స్పష్టం చేసింది.

2014 నుంచి పెరుగుదలే...: నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం 2014-19 నుంచి ఇప్పటి వరకు బాలికలు, మహిళల అదృశ్యం కేసులు క్రమేపీ పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019-20 మధ్య బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులు మొత్తంగా 24,557గా నమోదయ్యాయి. ఇందులో 2019లో 6,896 కేసులు నమోదవగా, 6,583 మంది ఆచూకీ లభించింది. 2020లో 7,576 నమోదవగా, 7,195 మందిని గుర్తించారు. 2021లో 10,085 మంది కేసులకుగాను 9,616 మందిని గుర్తించారు. 2019కు ముందు ఆచూకీ లభించని 1,540 మందితో కలిపి మొత్తంగా 26,099 కేసులున్నాయి. అందులో డిసెంబరు 31, 2021 నాటికి 23,394 మందిని గుర్తించారు. డిసెంబరు 31, 2021 నాటి లెక్కల ప్రకారం ఆచూకీ లభించని వారు 2,705 మంది ఉన్నారు. అటు 2022-23 సంవత్సర కాలం లెక్కలు చూస్తే, ఇప్పటికే దాదాపు 500 మంది మహిళల ఆచూకీ లభించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2015లో బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులు 6,865 నమోదవగా, అందులో 4,359 గుర్తించారు. 2016లో 6,960 కేసులకుగాను 3,970 గుర్తించారు. 2017లో 8,215 కేసులకుగాను 6,423 గుర్తించారు. 2018లో 7,584 కేసులకుగాను 6,042 మందిని గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని అదృశ్యం కేసుల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది.

దేశ ఐక్యతకు విఘాతం

ఉమ్మడి పౌరస్మృతిపై నారాయణ

హోసూర్: ఉమ్మడి పౌరస్మృతి దేశ ఐక్యతకు విఘాతం కలిగిస్తుందని సీపీఐ కార్యదర్శి డాక్టర్. కె.నారాయణ అన్నారు. ఆయన తమిళనాడు, హోసూర్‌లో పార్టీ స్థానిక నేతలు మథైయన్, చిన్నస్వామితో కలిసి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకించారు. దీనిని అమలు చేసేందుకు బీజేపీ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఓటు బ్యాంకు దృష్ట్యా ఉమ్మడి పౌరస్మృతిని బీజేపీ అమలు చేస్తుందని చెబుతూ ఇది చట్టరూపం దాల్చితే దేశ ఐక్యతకు విఘాతం కలుగుతుందని నారాయణ తెలిపారు. మంత్రిని గవర్నర్ తొలగించడం దేశంలో ఎన్నడూ జరగలేదని సెంథిల్ బాలాజీ తొలగింపునుద్దేశించన్నారు. మంత్రిని తొలగించే అధికారం గవర్నర్‌కు ఉండదని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించే ఉద్దేశంతో సీపీఐ... రెడ్ ఆర్మీ వలంటీర్ కార్ప్స్‌ను ఏర్పాటు చేసి, శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. డిసెంబరు 26న చెన్నైలో లక్షమంది వలంటీర్లతో ర్యాలీ నిర్వహించాలని, వచ్చే ఏడాది డిసెంబరులో దిల్లీలో ప్రదర్శనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు నారాయణ వెల్లడించారు.

ఏపీ, కర్నాటక నుంచి టమాట సేకరించండి: కేంద్రం

న్యూదిల్లీ: దేశవ్యాప్తంగా టమాట ధరలు రికార్డు స్థాయికి చేరాయి. కొన్ని ప్రాంతాల్లో టమాట దొరకడం లేదు. కిలో టమాట రూ.200 దాటింది. టమాటా ధరలు నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. కార్యాచరణకు ఉపక్రమించింది. ప్రధాన వినియోగ కేంద్రాల్లో పంపిణీ చేసేందుకుగాను ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర నుంచి టమాటా సేకరించాలని కేంద్ర సహకార సంస్థలు- నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్, నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్‌లను ఆదేశించింది. దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంత ప్రజలకు జులై 14 నుంచి రాయితీ ధరకు టమాటాలు పంపిణీ చేస్తామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ వెల్లడించింది. గుజరాత్, మధ్యప్రదేశ్‌తోపాటు మరికొన్ని రాష్ట్రాలకు ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి టమాటాలు సరఫరా అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లె నుంచి సరైన పరిమాణంలోనే వస్తున్నాయి. దిల్లీకి హిమాచల్ ప్రదేశ్‌తోపాటు కర్నాటక నుంచి అధికంగా వస్తాయి. మహారాష్ట్రలోని నారాయణ్‌గావ్, ఔరంగాబాద్‌తోపాటు మధ్యప్రదేశ్ నుంచి త్వరలోనే అదనపు పంట రానుంది. దీంతో త్వరలోనే టమాట ధరలు దిగివచ్చే అవకాశం ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ అంచనా వేసింది.

సంస్కారహీనుడు సీఎం జగన్

- వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు
- వలంటీర్లలో నేరస్తులు, దోపిడీదారులు
- తాడేపల్లిగూడెం సభలో పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం రూరల్: ప్రజాస్వామ్యంలో అన్నిరంగాల్లో మహిళలకు మంచి గౌరవం ఉందని, అలాంటి మహిళలను వైసీపీ సోషల్ మీడియా ఘోరంగా అవమాని స్తోందని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే నాయకుల కుటుంబ మహిళలపై వ్యంగ్య వీడియోలు చిత్రీకరిస్తూ అగౌరపరుస్తున్న ముఖ్యమంత్రి జగన్ చరిత్రహీనుడుగా మిగిలిపోతారన్నారు.వారాహి యాత్ర రెండవ దశలో భాగంగా తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డ్ సెంటర్లో బుధవారం జరిగిన భారీ బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. కుటుంబం నుంచి తల్లిని, చెల్లిని బయటకు గెంటేసిన సంస్కారహీనుడు జగన్ అని ఆరోపించారు.

తన కుటుంబ మహిళలపై అసభ్యకర వీడియోలను వైసీపీ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిపై వచ్చే ఎన్నికల్లో మహిళలే వైసీపీకి తగిన బుద్ధిచెబుతారన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సతీమణి భారతి స్పందించాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు రక్షణ కరువైందన్నారు. వలంటీర్ల నుంచి డేటా సేకరించి ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. చెత్త, పెట్రోలు, డీజిల్, కరెంటు, గ్యాస్, తదితరాలపై పన్నులు వేసి సామాన్య ప్రజలను దోచుకుంటున్న జగన్...అభివృద్ధి పనులపై దృష్టి పెట్టలేదన్నారు. వలంటీర్ వ్యవస్థలో నేరస్తులు, మద్యం వ్యాపారులు, ఆక్రమణదారులు ఉన్నారని, వారు పథకాల పేరుతో మహిళలను మోసం చేస్తున్నారన్నారు. పథకాలు రావని, పింఛను రాదని భయపెట్టి లొంగదీసుకుంటున్నారని తీవ్ర ఆరోపణ చేశారు. తాను వలంటీర్లకు వ్యతిరేకం కాదన్నారు. మద్యపాన నిషేధం చేసే దమ్ము ఉందా అని జగన్‌కు సవాల్ చేశారు. మద్యం ద్వారా ఏడాదికి 1.30 లక్షల కోట్లు దోచుకుంటున్నారని విమర్శించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అధికారంలోకి వచ్చి తీరుతుందని, మహిళలకు అన్ని విధాల రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్, జనసైనికులు, వీర మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అల్లూరి కృష్ణంరాజు మృతి

విశాలాంధ్ర - రాజోలు: తూర్పు గోదావరి జిల్లా, రాజోలు మాజీ ఎమ్మెల్యే అల్లూరి కృష్ణంరాజు మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. కృష్ణంరాజు మృతదేహాన్ని గురువారం స్వగ్రామం సఖినేటిపల్లికి తరలిస్తారని స్థానిక కాంగ్రెస్ నేతలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కంచుకోటగా ఉన్న రాజోలు నియోజకవర్గంలో అల్లూరి కృష్ణంరాజు కాంగ్రెస్ తరపున పోటీ చేసి 28,018 ఓట్ల మెజారిటీతో 2004 ఎన్నికల్లో గెలిచి చరిత్ర సృష్టించారు. ఆయన హయాంలో రాజోలు అభివృద్ధి బాటలో దూసుకెళ్లింది. పర్యాటక రంగంలో దిండి రిసార్ట్స్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు కోసం కృషిచేశారు. వరదల నుంచి రక్షణ కల్పించేందుకు రివిట్మెంట్లు గ్రోయిన్స్ ఏటిగట్టు ఆధునికరణ పనులు నిర్వహించడంతో పాటు తీర ప్రాంత వాసులకు దాహార్తిని తీర్చేందుకు తాగునీటి పైప్‌లైన్లు వేయడం, వాటర్ ట్యాంకుల నిర్మాణం, సఖినేటిపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, గొంది నోవా రామేశ్వరం శంకర్ గుప్తం మేజర్ డ్రైన్ మరమ్మతు పనులను చేపట్టారు. కృష్ణంరాజు నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసేవారు. కృష్ణంరాజు మరణంతో ఆయన అభిమానులు విషాదంలో మునిగిపోయారు.

ప్యాక్స్ బలోపేతంపై రేపు దిల్లీలో భారీ సమ్మేళనం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : 'ఎఫ్‌పీఓల ద్వారా ప్యాక్స్ బలోపేతం' అంశంపై శుక్రవారం న్యూదిల్లీలో ఒకరోజు భారీ సమ్మేళనం జరగనుందని జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్సీడీసీ) ప్రాంతీయ డైరెక్టర్ వీకే దుబాసి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ) ద్వారా ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ (ప్యాక్స్)ను బలోపేతం చేసే మార్గాలపై చర్చించడం ఈ సమ్మేళనం లక్ష్యమన్నారు. ప్రధాని మోదీ నినాదం 'సహకార్ సే సమృద్ధి' దార్శనికతను సాకారం చేయడానికి కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా కృషితో ఇటీవల సహకార రంగంలో 1100 కొత్త ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ పథకం కింద ప్రతి ఎఫ్‌పీఓకి 33లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహిస్తున్నా రన్నారు. వీటి నిర్వహణకు క్లస్టర్ బేస్డ్ బిజినెస్ ఆర్గనైజేషన్స్ (సీబీబీఓ)కు ఒక్కో ఎఫ్‌పీఓకి రూ.25లక్షలు అందిస్తున్నట్టు తెలిపారు. నిలకడగా వ్యవసాయం చేయడం, జీవనోపాధిని ప్రోత్సహించడం, వ్యవసాయ రంగంపై ఆధారపడిన వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో ఎఫ్‌పీఓలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ ఉత్పత్తిదారులు మెరుగైన ధరలు పొందడం, రవాణా ఖర్చులను తగ్గించుకోవడం, మొత్తం ఉత్పాదకతను పెంచుకోవడంలో ఎఫ్‌పీఓలు ఇతోధికంగా తోడ్పడతాయని దుబాసి వెల్లడించారు.

అలాగయితే 12వ పీఆర్సీ కమిషన్ అక్కర్లేదు

నేరుగా 50% మధ్యంతర భృతి ప్రకటించాలి

ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: 11వ పీఆర్సీ కమిషన్ మాదిరిగా నివేదిక బహిర్గతం చేయకుండా బుట్ట దాఖలు చేసేందుకయితే 12వ పీఆర్సీ కమిషన్ అవసరం లేదని నేరుగా 50% మధ్యంతర భృతి ప్రకటించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. సాయి శ్రీనివాస్, హెచ్. తిమ్మన్నలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల వేతన సవరణ కోసం సిఫార్సులు చేయడానికి ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలో ఒక సంవత్సర కాల పరిమితితో 12వ పీఆర్సీ కమిషన్ వేయడాన్ని స్వాగతిస్తున్నామని వారు పేర్కొన్నారు. అయితే నివేదికను బహిర్గతం చేసేవిధంగా రాష్ట్రోపాధ్యాయ సంఘం చట్టబద్ధ పీఆర్సీ కమిషన్‌ను కోరుకుంటోందని, కమిషన్ సిఫార్సులను చట్టబద్ధంగా అమలు చేసినప్పుడే 12వ పీఆర్సీ కమిషన్‌కు సార్థకత ఉంటుందని స్పష్టం చేశారు. అలా కాకుండా 11వ పీఆర్సీ మాదిరిగా నివేదికను రహస్యంగా ఉంచి బలవంతంగా పీఆర్సీ అమలు చేయడానికయితే కమిషన్ అవసరం లేదన్నారు. అందుకే ఈ ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లే లోపే కమిషన్‌కు బదులుగా నేరుగా 50 శాతం మధ్యంతర భృతి ప్రకటించి ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.





Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.